ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత మంగళవారం గరిష్ఠం : 37.0 కనిష్ఠం : 25.0
ANDHRAJYOTHY
5 అనంతపురం
జిల్లా వార్తలు
బుధవారం 4 జూన్ 2025



ప్రజాతీర్పు.. వెన్నుపోటా..?

వైసీపీ విధ్వంస పాలన నుంచి విముక్తి కాదా..? ఐదేళ్లలో ఒక్క పరిశ్రమనైనా తెచ్చారా..?



అనంతపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల తీరు గురివింద గింజ సామెతను తలపిస్తోందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును అపహాస్యం చేసేలా అదే రోజు వెన్నుపోటు దినం పేరిట నిరసన తెలపాలని వైసీపీ నిర్ణయించింది. దీనిపై కూటమి నేతల నుంచే కాదు.. మేధావి వర్గాలు, రాజకీయ విశ్లేషకులు, సామాన్య ప్రజానీకం నుంచి తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గత ఏడాది జూన్ 4న ప్రజలు ఏకపక్షంగా కూటమికి విజయాన్ని కట్టబెట్టారు. ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లోనూ కూటమి అభ్యర్థులు విజయబావుటా ఎగరవేశారు. రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లోనూ కూటమి అభ్యర్థులే గెలిచారు. ఉమ్మడి జిల్లాలో ఇది చారిత్రాత్మక విజయం. గత ఏడాది జూన్ 4న ఎన్నికల ఫలితాలు విడుదల కాగా, అదే నెల 12న కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. ప్రజల తీర్పు వెలువడిన రోజును వెన్నుపోటు దినం అని వైసీపీ అధిష్ఠానం అవమానిస్తోందని ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమౌతోంది. ఉమ్మడి జిల్లాలో కూటమికి ఇంతటి చారిత్రాత్మక విజయం అందిన నేపథ్యంలో ఆత్మావలోకనం చేసుకోవాల్సిన వైసీపీ నేతలు.. ప్రజా తీర్పును హేళన చేసేలా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఐదేళ్ల పాలనలో వైసీపీ నేతల అరాచకాలు, దౌర్జన్యాలు, భూకబ్జాలకు వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇచ్చారు. అయినా వైసీపీ నేతల తీరులో మార్పు కనిపించడం లేదన్నభావన ఆ పార్టీ వర్గాల్లోనే వ్యక్తమౌతోంది.

సంక్షేమం కనిపించదా..?

బటన్ నొక్కుడుకే ఐదేళ్ల సమయం వెచ్చించారని, కరువు జిల్లా అభివృద్ధికి ఏ మేరకు చర్యలు తీసుకున్నారో చెప్పే పరిస్థితి ఉందా..? అని వివిధ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. హంద్రీనీవా విస్తరిస్తామని, హెచ్చెల్సీకి సమాంతర కాలువ తవ్వుతామని, ప్రతి ఎకరానికీ సాగునీరు ఇస్తామని పదేపదే హామీలు ఇవ్వడం తప్ప.. గంపెడు మట్టి తీయలేదన్నది వాస్తవం కాదా..? అని (మిగతా 6వ పేజీలో..)

వెన్నుపోటు.. జగన్ రెడ్డి పేటెంట్

మోసం.. వెన్నుపోటు.. గొడ్డలిపోటు జగన్‌రెడ్డి పేటెంట్. కుంభకోణాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే జగన్ ఈ డ్రామాలు చేయిస్తున్నారు. ప్రజలు అధికారం ఇస్తే... తొలి ఏడాదిలో జగన్ పది శాతం హామీలను కూడా నెరవేర్చలేదు. ఐదేళ్ల పాలనలో 85 శాతం హామీలకు ఎగనామం పెట్టారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా తొలి ఏడాదిలోనే మా కూటమి ప్రభుత్వం 70 శాతం హామీలను అమలు చేస్తోంది. ఐదేళ్ల పాలనలో జగన్‌రెడ్డి ప్రజలకు వెన్నుపోటు పొడిచాడు కాబట్టే.. గడిచిన ఎన్నికల్లో ప్రజలు ఓటుతో పోటు పొడిచారు. ఆ పోటు నుంచి ఇంకా కోలుకోలేనట్లు ఉంది. ఆస్తి కోసం తల్లిని, చెల్లిని ఇంటి నుంచి గెంటేసి.. కుటుంబ వ్యవస్థకే వెన్నుపోటు పొడిచిన వ్యక్తి జగన్. ఎత్తుకొని పెంచిన సొంత బాబాయ్‌ని గొడ్డలి వేటుతో నరికిచంపిన కిరాతకులను కాపాడుతూ, రక్తసంబంధానికి వెన్నుపోటు పొడిచాడు. ప్రజలు ఇచ్చిన తీర్పును వెన్నుపోటు దినమని ధర్నాలు, ర్యాలీలకు పిలుపునివ్వడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే.

-వెంకటశివుడు యాదవ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు



కూటమి విజయంతోనే పారిశ్రామికాభివృద్ధి వాస్తవం కాదా..?

సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేయడం లేదా..?

వైసీపీ నేతల తీరుపై కూటమి నేతలు, ప్రజల ఆగ్రహం

అధనపు బాధ్యతలు..!

- మండల పరిషత్తులో మాయ
- రెండ్రోజులు ముందే ఉత్తర్వు
- బదిలీపై వెళ్తూ అధికారి వసూళ్లు



బ్రహ్మసముద్రం మండల పరిషత్తు కార్యాలయం

బ్రహ్మసముద్రం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఓ పంచాయతీ కార్యదర్శి ఈనెల 5వ తేదీ నుంచి సెలవులో వెళ్తుంటే.. మూడు రోజులు ముందుగానే మంగళవారమే మరొకరికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ ముందస్తు ఉత్తర్వుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇలా.. ఎలా.. ఇస్తారన్న చర్చ సాగుతోంది. బ్రహ్మసముద్రం ఎంపీడీఓ పేరుతో వెలువడిన ఈ ముందస్తు ఉత్తర్వు వెనుక పెద్ద తతంగమే ఉంది. బదిలీ అయిన అధికారి ఒకట్రెండు రోజుల్లో రిలీవ్‌కానున్నారనీ, వెళ్తూ.. వెళ్తూ.. అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడుతున్నారని కార్యాలయంలో బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఆమ్యామ్యాలు పుచ్చుకునే ముందస్తు ఉత్తర్వు ఇచ్చినట్లు ఆరోపిస్తున్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో పనిచేసే ఓ అధికారి అవినీతికి అడ్డూ అదుపు లేకుండాపోయింది. ఉపాధి హామీ పనులు, 15వ ఆర్థిక సంఘం నిధులు, మండల పరిషత్తు గ్రాంట్ ఇలా.. అన్నింట్లో ఆ అధికారి అవినీతికి తెరలేపారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ శాఖలో పనిచేసే ఉద్యోగులు సెలవుపై వెళ్లినా ఫోన్ పేలో అమౌంట్ వేయించుకుని, వారికి జీతాలు మంజూరు చేస్తున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. గ్రామ సచివాలయాల్లో పనిచేసే సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు వివిధ కారణాలపై సెలవులపై వెళ్లినా జీతాలు వచ్చేలా చూస్తాననీ, ఎంతో కొంత డబ్బు ముట్టజెప్పాలని ఆ అధికారి వసూళ్లు చేస్తున్నట్లు తెలిసింది. పంచాయతీ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు అప్పగించేందుకు సైతం ఫోన్ పే ద్వారా డబ్బు చెల్లించాల్సి ఉంటుందని ఆ కార్యాలయంలో బహిరంగంగా చర్చించుకుంటున్నారు. మండలంలోని గుండిగానిపల్లి పంచాయతీ కార్యదర్శి మైలారప్ప ఈనెల 5 నుంచి 21వ తేదీ వరకు సెలవుపై వెళ్తున్నారు. ఆయన స్థానంలో భైరసముద్రం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న అనిల్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మైలారప్ప 5 నుంచి సెలవులో వెళ్తుండగా.. అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రెండ్రోజులు ముందే ఉత్తర్వు వెలువడడం గమనార్హం. 6వ తేదీ జారీ చేసినట్లు అందులో ఉండగా.. 3నే వెలువరించారు. దీనిని చూసి కార్యాలయ సిబ్బందే అవాక్కవుతున్నారు. ఆ అధికారి ఒకట్రెండు రోజుల్లో రిలీవ్ అవుతుండడంతోనే బరితెగించి, ముందస్తుగా ఉత్తర్వులు ఇచ్చినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి.



ఆరో తేదీతో మంగళవారమే జారీచేసిన ఉత్తర్వు

విద్యార్థి మిత్ర సిద్ధం

- మండలాలకు చేరిన ఎస్ఆర్‌కేవీఎం కిట్లు
- బడులు తెరవగానే విద్యార్థులకు పంపిణీ
- రాజకీయ ముద్రలు లేకుండా మెటీరియల్



జిల్లాకు చేరిన డిక్షనరీలను దించుకుంటున్న వర్కర్లు

అనంతపురం విద్య, జూన్ 3(ఆంధ్రజ్యోతి): బడి గంటలు మోగే వేళైంది. వేసవి సెలవులు చివరి దశకు చేరాయి. మరో ఎనిమిది రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈలోగా విద్యార్థులకు ఉచితంగా అందించే సర్వేపల్లి రాధాక్రిష్ణ విద్యార్థి మిత్ర (ఎస్ఆర్‌కేవీఎం) కిట్లను ప్రభుత్వం శరవేగంగా పాఠశాలలకు చేరుస్తోంది. ఇప్పటికే భారీగా మండల కేంద్రాలను చేరాయి. కిట్‌లో బ్యాగు, బెల్టు, బూట్లు, నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, 3 జతల యూనిఫాం, డిక్షనరీ ఉంటాయి. పాఠ్యపుస్తకాలు 17,88,616, బెల్టులు 1,40,482, డిక్షనరీలు 20,029, నోట్ పుస్తకాలు 11,23,964, బూట్లు 1,96,330 జిల్లాకు సరఫరా అయ్యాయి. 90 శాతానికి పైగా మెటీరియల్‌ను మండల కేంద్రాలకు చేర్చారు. అక్కడి నుంచి స్కూల్ పాయింట్లకు పంపేందుకు విద్యాశాఖ సన్నద్ధం అవుతోంది. ఇప్పటికే పలు మండలాల్లో స్కూల్ పాయింట్లకు సరఫరా మొదలైంది.



డిక్షనరీలు

ఫొటోలు, ముద్రలకు స్వస్తి..

విద్యా కానుక కిట్లపై గత ప్రభుత్వం జగన్ ఫొటోలు, వైసీపీ రంగులు, ఫొటోలు ముద్రించింది. బ్యాగులు, బెల్టులు, పుస్తకాలపై జగన్ ఫొటోలు ముద్రించి.. ప్రచారం చేసుకుంది. విద్యార్థులకు అందించే మెటీరియల్ ద్వారా కూడా రాజకీయ లబ్ధి పొందాలని చూసింది. ఈ పద్ధతికి టీడీపీ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం స్వస్తి పలికింది. కిట్ పేరును సర్వేపల్లి రాధాక్రిష్ణ విద్యార్థి మిత్రగా మార్చింది. గుర్తులు, ముద్రలకు స్వస్తి పలికింది. ఈ ఏడాది అందించే కిట్లలో ఎక్కడా ప్రస్తుత ప్రభుత్వ, పార్టీల ముద్రలు, ప్రజాప్రతినిధుల ఫొటోలు లేకుండా తయారు చేయించింది.

నాణ్యమైన కిట్లు అందిస్తున్నాం..



విద్యార్థులకు నాణ్యమైన విద్యార్థి మిత్ర కిట్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇప్పటికే 90 శాతం కిట్లు జిల్లాకు చేరాయి. ఈ నెల 12వ తేదీలో మండల కేంద్రాల నుంచి స్కూల్ పాయింట్‌లకు కిట్లు చేర్చాలని ఎంఈఓలను ఆదేశించాం. పాఠశాలలు పునఃప్రారంభం కాగానే ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో పండుగ వాతావరణంలో విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ చేస్తాం.

-శైలజ, ఏపీసీ, సమగ్రశిక్ష

అడిగినవి.. వచ్చినవి..

మెటీరియల్	జిల్లా ఇండెంట్	జిల్లాకు సప్లై చేసినవి
బ్యాగులు	1,98,556	1,57,500
బెల్టులు	1,40,482	1,40,482
డిక్షనరీలు	20,029	20,029
నోట్ బుక్స్	11,23,964	11,23,964
బూట్లు	1,96,330	1,96,330
పాఠ్యపుస్తకాలు	17,88,616	17,78,088
యూనిఫామ్స్	1,98,556	77,168

నిమ్మ చెట్లు నరికి... డ్రిప్ పరికరాలు దహనం 7

నేడు మెము రైలు
ప్రారంభం
అనంత నుంచి బెంగళూరుకు ప్రయాణం సులభతరం 7

శిథిల సదనాలు..!



శిథిలావస్థకు చేరుకున్న రామ, లక్ష్మణ సదనాలు
కసాపురం భక్తులకు వసతి తిప్పలు
శిథిలావస్థలో గదులు
పనిచేయని ఏసీలు
వీడని మాస్టర్‌ప్లాన్ పీటముడి
6

డీజిల్ దొంగల ముఠా గుట్టు రట్టు
- వ్యవసాయ తోటలో నిల్వ
- 1500 లీటర్ల డీజిల్ పట్టివేత
- ముగ్గురు నిందితుల అరెస్టు
7

ఫ్లెక్సీ రగడ
6

ఏమాత్రం బాధ్యత లేకుండా..!

కదిరి నిజాంవలీకాలనీకి చెందిన ఓ మహిళలకు నెలసరి సమయంలో కడుపు నొప్పి రావడంతో ఉపశమనం కోసం పట్టణంలోని మదనపల్లి రోడ్డులోని ఓమెడికల్ స్టోర్‌లో మాత్రలు కొనుగోలు చేశారు. మాత్రలు మింగిన ఐదారు గంటల తరువాత ఆమెకు తీవ్ర రక్తస్రావం అయ్యింది. కుటుంబ సభ్యులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి, ఆమె వాడిన మాత్రలు చూపించారు. అక్కడ వైద్య సిబ్బంది వాటిని పరిశీలించి, కాలం చెల్లినవిగా గుర్తించారు. కుటుంబ సభ్యులు మెడికల్ స్టోర్ యజమానిని నిలదీయగా, వైద్యానికి అయ్యే ఖర్చులు భరించినట్లు సమాచారం.

మందుల విక్రయాల్లో ఇష్టారాజ్యం

- వైద్యుల చీటీ లేకుండానే అమ్మకాలు
- షాపుల్లో కానరాని ఫార్మాసిస్టులు
- రోగుల ప్రాణాలతో చెలగాటం
- నామమాత్రంగా అధికారుల తనిఖీ



కదిరి అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మెడికల్ షాపు నిర్వాహకులు ఇష్టారాజ్యంగా మాత్రలు అమ్మేస్తున్నారు. డాక్టర్ చీటీ లేకపోయినా ఆరోగ్య సమస్య చెబితే చాలు ఏమందులు వేసుకోవాలో, రోజుకు ఎన్ని వేసుకోవాలో, ఎన్నిరోజులు వాడాలో కూడా చెబుతున్నారు. వీరిచ్చే మందులతో తాత్కాలికంగా ఉపశమనం కలిగినా, దీర్ఘకాలంలో దుష్పరిణామాలు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

మెడికల్ షాపులు నిర్వహించాలంటే..

డ్రగ్ అండ్ కాస్మెటిక్ యాక్టు 1940, ఫార్మసీ యాక్టు 1948 ప్రకారం బీ ఫార్మసీ లేదా ఎం ఫార్మసీ పూర్తి చేసిన వారు మాత్రమే మెడికల్ షాపులు నిర్వహించాల్సి ఉంటుంది. షాపు అనుమతి తీసుకునే సందర్భంలో సంబంధిత ఫార్మసిస్టుల సర్టిఫికెట్లతోపాటు వ్యక్తిగత గుర్తింపుకార్డులు, చిరునామా తదితర వివరాలతో కూడిన దరఖాస్తులను డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు సమర్పించాల్సి ఉంటుంది. అనంతరం సంబంధిత అధికారుల నుంచి అనుమతులు మంజూరైన తరువాత షాపులు నిర్వహించాల్సి ఉంటుంది.

లైసెన్సు ఒకరిది.. నిర్వహణ మరొకరిది..

జిల్లాలో చాలా మందుల షాపులు బినామీ వ్యక్తులే నిర్వహిస్తున్నారు. నింబంధనలకు విరుద్ధంగా మెడికల్ షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. షాపులో కనీసం బి.ఫార్మసీ చేసినవారే ఉంటూ మందులు ఇవ్వాలి. కానీ చాలవరకు అద్దె లైసెన్సులు తెచ్చుకుని, మెడికల్ దందా నిర్వహిస్తున్నవారే అధికంగా ఉన్నారు. సంబంధిత శాఖ అధికారుల అండదండలతోనే ఇదంతా జరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. చిన్న క్లినిక్ నుంచి, నర్సింగ్ హోమ్ వరకు ఎవరికి వారే మెడిల్ షాపులు ఏర్పాటు చేసుకుని, కాస్త అనుభవమున్నవారి ద్వారా మందులమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీల ఇళ్లలో మెడికల్ షాపును తలపించేలా అన్నిరకాల మందులు ఉంటాయి.

అవసరంలేని మందులు

వివిధ మందుల కంపెనీల ప్రతినిధులు ఇచ్చే తాయిళాలకు ఆశ పడి రోగులకు అవసరం లేకున్నా మందులను అంటగడుతున్నారు. ఒకటిరెండు రకాల మందులతో నయమయ్యే రోగానికికూడా ఐదారు కంపెనీల (మిగతా 6లో..)

రేషన్ పంపిణీపై కలెక్టర్ ఆరా

అనంతపురం టౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): 'మీరే డీలర్ వద్దకెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకున్నారా? లేదంటే వీఆర్వో ఇంటివద్దకే తెచ్చి ఇచ్చారా?' అని వృద్ధులు, దివ్యాంగ లబ్ధిదారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆరాతీశారు. కొవ్వూరు నగర్ 6వ వార్డు రేషన్ షాపు పరిధిలోని వృద్ధులు, దివ్యాంగ లబ్ధిదారుల ఇళ్ల వద్దకు కలెక్టర్ వెళ్లి, సరుకుల పంపిణీపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వృద్ధులు, దివ్యాంగులు, మంచానికే పరిమితమైన లబ్ధిదారులకు ప్రతి నెలా తప్పనిసరిగా ఇళ్లవద్దకే రేషన్ సరకులు అందిచాలన్నారు. ఈ విషయంలో వీఆర్వోలు, డీలర్లు నిర్లక్ష్యంచేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.



జిల్లాకేంద్రంలో దివ్యాంగురాలికి రేషన్ సరుకులను ఇంటివద్దనే అందజేస్తున్న కలెక్టర్

బీఎస్ఎఫ్ జవాన్ మామకు భూమి అప్పగింత (7లో)

శిథిల సదనాలు..!

కసాపురం భక్తులకు వసతి తిప్పలు
శిథిలావస్థలో గదులు
పనిచేయని ఏసీలు
వీడని మాస్టర్‌ప్లాన్ పీటముడి



గదుల నిర్వహణ సరిగా లేని కేసరి సదనం



కసాపురం దేవస్థానం

గుంతకల్లు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిచెందిన కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులకు సరైన వసతి గదుల్లేక ఇక్కట్లు పడుతున్నారు. వేసవిలో ఏసీలు పనిచేయక అవస్థలు పడ్డారు. ఉన్న ఏసీ గదుల్లో ఎయిర్ కండిషన్ యంత్రాలు మూలనపడడంతో వాటిని నాన్ ఏసీ వసతి గదులుగా మార్చేశారు. దేవస్థానంలో తొమ్మిదేళ్ల కిందట నిర్మించిన ప్రాథమిక వసతి గదుల సముదాయం (పీఏసీ)లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. దేవస్థానానికి భక్తులు ఇచ్చిన విరాళాల రిజర్వ్ నిధులు పుష్కలంగా ఉన్నా, మాస్టర్ ప్లాన్ లేదన్న కారణంగా ఆలయంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడంలేదు. మంగళ, శనివారాల్లో ఆలయానికి నిద్ర చేయడానికి వచ్చే భక్తులు సరైన వసతి గదుల్లేక ప్రైవేటు లాడ్జిలను ఆశ్రయిస్తున్నారు. ఇక నాన్ ఏసీ రూముల నిర్వహణ అత్యంత అధ్వానంగా ఉంది. రూములు దుర్వాసన వెదజల్లుతుంటాయి. డబ్బులిచ్చి ఈ గదుల్లో నిద్రించేకంటే ఆలయ ఆవరణలో ఆరుబయట పడుకోవడమే ఉత్తమమని భక్తులు భావిస్తున్నారు.

రెండు ఏసీ రూములే గతి

కసాపురం దేవస్థానంలో టీడీపీ హయాంలో నిర్మించి ప్రారంభించిన పీఏసీలో భక్తుల సౌకర్యార్థం 16 ఏసీ గదులతో పాటు, నాలుగు సూట్ రూములు, డార్మెటరీలు, వివాహాది కార్యక్రమాలను నిర్వహించుకోవడానికి హాళ్లను ఏర్పాటుచేశారు. ఆ కొత్త భవనంలో ఉన్న 16 ఏసీ గదుల్లో ఒక్క దాంట్లో మాత్రమే ఏసీ పనిచేస్తోంది. ఏసీలు పనిచేయని రూములను నాన్ ఏసీ కింద బుక్ చేస్తున్నారు. ఆలయ అన్నదాన సదనానికి ఆనుకుని ఉన్న నాలుగు ఏసీ సూట్‌లలో ఒకటి, ఒక స్పెషల్ గెస్ట్‌హౌస్‌లో మాత్రమే ఏసీలు నడుస్తున్నాయి. మిగతా వాటన్నింటినీ నాన్ ఏసీగా ట్రీట్ చేస్తున్నారు. దేవస్థానంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి అవసరమైన మాస్టర్ ప్లాన్‌ను రూపొందించే కార్యక్రమం ఓ ప్రహసనంగా మారింది. 15 ఏళ్ల నుంచీ కసాపురం దేవస్థానానికి మాస్టర్ ప్లాన్‌ను రూపొందించే విషయంగా ప్రతిపాదనలు, హామీలు, కార్యాచరణలు చేపడుతున్నా ఏదీ కొలిక్కిరాలేదు. దీంతో దేవస్థానంలో అభివృద్ధి కార్యక్రమం చతికిలపడింది.

నిర్వహణ అధ్వానం

కసాపురం దేవస్థానంలో భక్తుల వసతి కోసం పీఏసీ సముదాయం కాకుండా కేసరి సదనంలో 30, రామ, లక్ష్మణ సదనాల్లో 30 గదులు అందుబాటులో ఉండేవి. రామ, లక్ష్మణ సదనం భవనాలు నిర్మించి చాలా సంవత్సరాలు గడవడంతో అవి పాతబడిపోయాయి. రామ సదనంలో పైఅంతస్తు పూర్తిగా శిథిలమైపోవడంతో తొలగించేశారు. ఈ 30 గదుల్లో ఐదింటిని మాత్రమే వినియోగిస్తున్నారు. మిగతావన్నీ అద్దెకిచ్చే స్థితిలో లేవు. కేసరి సదనంలో ఉన్న 30 గదుల్లో రెండింటిని స్టేట్ బ్యాంకు శాఖ కోసం ఇచ్చారు. మరమ్మతులు చేయాల్సి ఉందంటూ ఆరింటిని మూతేశారు. మిగిలిన గదులు కూడా దుర్వాసన వెదజల్లుతూ జుగుప్సాకరంగా ఉంటున్నాయని భక్తులు వాపోతున్నారు. కేసరి సదనంలో కొన్ని గదులకు ఐదేళ్ల కిందట మరమ్మత్తులు చేయగా, పైకప్పులు మరలా శిథిలమైపోయాయి. ఆలయంలో దాదాపు 70 మంది కాంట్రాక్టు, పర్మనెంటు కార్మికులున్నా.. రాజకీయాల నేపథ్యంలో వారితో సక్రమంగా పనిచేయించుకోలేని దుస్థితి దాపురించింది. ఈ కారణంగా గదుల నిర్వహణ అధ్వానంగా మారడం, ఏసీలు ఉన్నా పనిచేయకుండా పోవడం భక్తులకు శాపంగా మారింది. కాగా, పీఏసీలోని డార్మెటరీలను వసతి గదులుగా మార్చే యోచనలో అధికారులు ఉన్నట్టు సమాచారం.

పది రోజుల్లో ఏసీలను సిద్ధం చేస్తాం

కోతుల కారణంగా ఏసీ కనెక్షన్లు కట్ అయ్యాయి. వాటికి మరమ్మతులు చేయడానికి టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్ల నుంచి సరైన స్పందన రాలేదు. మెకానిక్‌ను పిలిపించి ఏసీలను సత్వరమే రిపేరీ చేయించి, వినియోగంలోకి తెస్తాం.

-వాణి, కసాపురం ఆలయ కార్యనిర్వాహణాధికారి

గదులను సక్రమంగా నిర్వహించాలి



శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం ఎంతో ప్రసిద్ధి. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, హనుమాన్ దీక్షాపరులకు సరైన వసతి గదులు అందుబాటులో లేవు. కొత్తగా నిర్మించిన పీఏసీలో కేవలం ఒక్క గదిలోనే ఏసీ పనిచేస్తోందంటే నిర్వహణ ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఏ ఈఓ వచ్చినా ఇక్కడి సమస్యలు పరిష్కారం కావడంలేదు. వెంటనే కొత్త గదులను నిర్మించాల్సిన అవసరం ఉంది.

- ప్రసాదరెడ్డి, కసాపురం గ్రామస్థుడు

కనీస సౌకర్యాలు కల్పించాలి



ఆలయానికి వచ్చి భక్తితో నిదురచేసి చేయాలనుకునే భక్తులకు సరైన వసతులు లేకుంటే నిరుత్సాహానికి లోనవుతారు. భక్తులు అసంతృప్తికి లోనుకాకుండా ఆలయం వద్ద కనీస సౌకర్యాలను కల్పించాలి. ఆ మేరకు వసతి గదులకు మరమ్మతులు చేయించి, సక్రమంగా నిర్వహించాలి.

- జగన్నాథ్, గుంతకల్లు

వసతుల కల్పనపై దృష్టిపెట్టాలి



వేలాదిగా భక్తులు వచ్చే కసాపురం దేవస్థానంలో వసతి గదులను సక్రమంగా నిర్వహించకపోవడం శోచనీయం. భక్తులకు తాగునీరు, పరిసరాల పరిశుభ్రత, హైజీనిక్‌గా టాయిలెట్ల నిర్వహణ చేపట్టకపోతే పరిపాలనా వ్యవస్థ విఫలమైనట్టే. ఆలయంలో ఏ అభివృద్ధి కార్యక్రమానికైనా మాస్టర్ ప్లాన్ పెద్ద అడ్డంకిగా మారుతోంది. వెంటనే రాజకీయాలకు అతీతంగా మాస్టర్ ప్లాన్‌ను సిద్ధంచేయడానికి ప్రభుత్వం, అధికారులు కృషిచేయాలి.

-మంజుల వెంకటేశ్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు, గుంతకల్లు

ఉచిత ఇసుక విధానంతో పేదలకు మేలు

జిల్లా భూగర్భగనుల శాఖ అధికారి వెంకటేశ్వర్లు



అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం తీసుకువచ్చిన ఉచిత ఇసుక విధానంతో ఎంతో మంది పేదలకు మేలు జరుగుతోందని జిల్లా భూగర్భగనుల శాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఉచిత ఇసుక విధానం, జిల్లాలో మైనింగ్ తదితర విషయాలపై జిల్లా భూగర్భగనుల శాఖ అధికారి వెంకటేశ్వర్లు పలు విషయాలు వివరించారు.

ప్రశ్న: ఉచిత ఇసుక విధానం జిల్లాలో ఎలా అమలవుతోంది ?

జవాబు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక విధానం పటిష్టంగా, విజయవంతంగా, ఎటువంటి ఇబ్బందులు లేకుండా పేదలకు మేలు కలిగేలా అమలు చేస్తున్నాం.

ప్రశ్న: ఇసుక అక్రమ రవాణాను ఎలా అరికడుతున్నారు...?

ఇంటర్వ్యూ

జవాబు: ఎవరైనా కమర్షియల్ పనుల కోసం ఇసుక రీచ్‌ల్లో తవ్వినా, అక్రమంగా అమ్మకానికి తరలించినా చర్యలు తప్పవు. ఫిర్యాదులు అందిన వెంటనే దాడి చేస్తున్నాం. వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేస్తున్నాం. సొంత నిర్మాణాలకు మాత్రమే ఉచిత ఇసుక విధానం వర్తిస్తుంది.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని ఇసుక రీచ్‌లు ఉన్నాయి...?

జవాబు: జిల్లాలో ప్రస్తుతం కణేకల్లు మండలం రచ్చుమర్రిలో మాత్రమే ఇసుక రీచ్ పనిచేస్తోంది. మొత్తం 60వేల టన్నుల ఇసుకకు అనుమతించగా..ఇప్పటి వరకు 20వేల టన్నుల ఇసుక తరలించారు. ఇక 40వేల టన్నులు ఇసుక అందుబాటులో ఉంది. ఇల్లూరు, కర్తనపల్లి, అజ్జయ్యదొడ్డిలలో ఇసుక రీచ్‌లు అందుబాటులోకి రానున్నాయి. ఇక పట్టాల్యాండ్‌లో ఇసుక తవ్వకాలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిస్తోంది. జిల్లాలో పట్టాభూముల్లో 7 ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలకు అనుమతిచ్చారు. మరో 23 వాగు, వంకలు, ఏరులో ఇసుక తవ్వకానికి అనుమతిచ్చారు.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని మైనింగ్ లీజులున్నాయి...?

జవాబు: 127 ఉన్నాయి. ప్రస్తుతం 83మైనింగ్ లీజులు మాత్రమే పనిచేస్తున్నాయి.

ప్రశ్న: జిల్లాలో ఖనిజ తవ్వకాలు, లీజుల చెల్లింపులు ఎవరికి కడుతున్నారు...?

జవాబు: గత ప్రభుత్వంలో మైనింగ్ లీజుల రాయల్టీ అమిగోస్ సంస్థకు చెల్లించేవారు. ప్రస్తుతం ఆ సంస్థ గడువు ముగిసింది. అమిగోస్ సంస్థ ప్రభుత్వానికి రూ.60కోట్ల వరకు బకాయి చెల్లించాల్సి ఉంది. కొత్త వారికి కాంట్రాక్ట్ ఇచ్చే వరకు లీజుదారులు ప్రభుత్వ ఖాతాలోకి రాయల్టీ కడుతున్నారు. అంతా ఆన్‌లైన్‌లో చెల్లింపులు జరుగుతాయి.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కడపలోని వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి ఈనెల 19వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) ఉదయ్ భాస్కర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. 4వ తరగతిలో బాల, బాలికలకు 20 చొప్పున మొత్తం 40 సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. ఐదో తరగతిలో కూడా అదే స్థాయిలో ఖాళీలున్నాయన్నారు. 4వతరగతిలో ప్రవేశాలకు 2015 ఏప్రిల్ 1 నుంచి 2017 మార్చి 31వతేదీ మధ్య జన్మించి 8-10 సంవత్సరాల వయసుగల విద్యార్థులు అర్హులన్నారు. ఐదో తరగతిలో ప్రవేశానికి 2014 ఏప్రిల్ 1 నుంచి 2016 మార్చి 31వతేదీ మధ్య జన్మించిన 9-11 ఏళ్ల మధ్య వయసు వారు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి వేర్వేరు దశల్లో ఎంపిక పోటీలుంటాయన్నారు. జూలై 21 నుంచి 23తేదీ మధ్య ఎంపికైన అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారన్నారు. వివరాలకు 7989090758 నంబరులో సంప్రదించాలని కోరారు. apsportsschool.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఎస్‌డీఓ సూచించారు.

ప్రజాతీర్పు.. వెన్నుపోటా...?

(5వ పేజీ తరువాయి)

రైతాంగం ప్రశ్నిస్తోంది. ఐదేళ్ల పాలనలో ఒక్క పరిశ్రమనైనా తీసుకొచ్చారా..? ఉపాధి కల్పించారా..? అని యువత ప్రశ్నిస్తోంది. పింఛన్ రూ.3 వేలు ఇస్తానని చెప్పి... ఏడాదికి రూ.250 పెంచి, చివరి సంవత్సరంలో రూ.3 వేలకు పెంచారని ప్రజలు విమర్శిస్తున్నారు. కూటమి అధికారంలోకి రాగానే హామీ మేరకు మూడు నెలల అదనపు రూ.వెయ్యి కలుపుకుని ఒకేసారి రూ.7వేలు చెల్లించారని గుర్తు చేస్తున్నారు. పేదల కడుపునింపేందుకు రూ.5కు కడుపు నిండా భోజనం పెట్టే అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించిన విషయం కనిపించడం లేదా..? అని ప్రశ్నిస్తున్నారు.

గుంతల రోడ్లను మరువలేదు..



వైసీపీ హయాంలో రహదారులపై మోకాలు లోతు గుంతలు పడి, వాహనదారులు నరకయాతన పడిన విషయాన్ని ఇంకా మరిచిపోలేదు. కూటమి ప్రభుత్వం ఆ గోతులను పూడ్చి ఉపశమనం కలిగించింది వాస్తవం కాదా..? అని ప్రజలు వైసీపీ నేతలను ప్రశ్నిస్తున్నారు.



సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నది కనిపించడం లేదా..? అని కూటమి నేతలు, వివిధ వర్గాల ప్రజలు నిలదీస్తున్నారు. ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితం హామీ అమలౌతోందని, మెగా డీఎస్సీతో 16 వేలకు పైగా టీచర్ పోస్టుల భర్తీ చేస్తున్నారని గుర్తు చేస్తున్నారు. ఈ నెలలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు అమలు చేయనున్నారు. ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే పీ-4 పథకం అమలవుతోంది.

సాగునీటికి ప్రాధాన్యం..

కరువు జిల్లాలో ప్రతి ఎకరానికీ సాగునీరు ఇవ్వాలన్న ఏకైక లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు హంద్రీనీవా ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.3,800 కోట్లు కేటాయించారు. పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇవన్నీ వైసీపీ నేతలకు కనిపించడం లేదా..? అని జిల్లా రైతాంగం ప్రశ్నిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగులకు ఏనాడైనా ఒకటో తేదీ వేతనాలు ఇచ్చారా అని ఆ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం తొలి నెల నుంచే ఒకటో తేదీన జీతాలు ఇస్తోందని గుర్తు చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిలోపే అనేక పరిశ్రమలొచ్చాయి. ఇటీవలే బేతాపల్లిలో రూ.22 వేల కోట్లతో రెన్యూ పవర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగింది వాస్తవంకాదా..? రాయదుర్గం, ధర్మవరం, మడకశిర, కదిరి తదితర నియోజకవర్గాల్లో సోలార్ పవర్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసింది కూటమి ప్రభుత్వం కాదా..? అని వైసీపీ నేతలను ప్రజానీకం ప్రశిస్తోంది. టీడీపీ హయాంలో నెలకొల్పిన కియ పరిశ్రమతో ప్రత్యక్షంగా 10వేల మంది, పరోక్షంగా మరో 10వేల మందికి ఉద్యోగాలు లభించాయని, వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క పరిశ్రమను తెచ్చారా అని ప్రజలు నిలదీస్తున్నారు. పైగా జాకీ పరిశ్రమను పారిపోయేలా చేశారని మండిపడుతున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన ఆర్థిక విధ్వంసం నేపథ్యంలో ఆ కష్టాల నుంచి గట్టెక్కుతూ, ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం అమలుచేస్తూ ముందుకు సాగుతోందని అంటున్నారు. ఇలాంటి తరుణంలో ప్రజాతీర్పు వెలువడిన రోజును వెన్నుపోటు దినంగా నిర్వహించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

ఫ్లెక్సీ రగడ



ప్రజాసంఘాల నేతలను అడ్డుకుంటున్న పోలీసులు

అనంతపురం సెంట్రల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి భూకబ్జాదారుడని ముద్రించిన ఫ్లెక్సీ వివాదానికి తెరలేపింది. ఈ రగడకు రామ్‌నగర్‌లోని యాదవభవన్ మంగళవారం వేదికైంది. బీజేపీ నాయకులు, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణయాదవ్‌కు చెందిన భూములను మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కబ్జాచేశారంటూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాలతోపాటు వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో యాదవ్ భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా 'మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి భూ కబ్జాదారుడ'ని ముద్రించిన ఫ్లెక్సీని సమావేశ బ్యాంక్ గ్రౌండ్‌లో ప్రదర్శించారు. విషయం పల్లె అనుచరులకు తెలియడంతో వారు యాదవ భవన్‌కు చేరుకున్నారు. రెండువర్గాల మధ్య రగడ నెలకొంటున్నసమయంలో టూటౌన్ పోలీసులు అరంగ్రేటంచేసి అడ్డుకున్నారు. అనధికారికంగా ఇలాంటి సమావేశాలు నిర్వహించడం నిషిద్ధమనీ, ఒక వ్యక్తిపై ఆరోపణలు చేస్తూ ఫ్లెక్సీని ఏర్పాటుచేయడం వివాదాలకు దారితీస్తుందని ఈ సందర్భంగా సీఐ శ్రీకాంత్ యాదవ్.. ఇరువర్గాలను హెచ్చరించారు. చట్టపరంగా వెళ్లాలనీ, శాంతిభద్రతల సమస్యలు సృష్టించవద్దని చెప్పి.. ఇరువర్గాల వారిని పోలీసులు పంపించేశారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ.. బీసీ వర్గానికి చెందిన వ్యక్తి.. ఆర్థికంగా, రాజకీయంగా ఎదగకూడదని పల్లె రఘునాథరెడ్డి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగానే బీజేపీ నాయకులు, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్‌కు చెందిన భూములను కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి వ్యక్తులతో ప్రభుత్వం పట్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లో వ్యతిరేకత వస్తుందన్నారు. కాగా.. యాదవ భవన్‌లో పల్లె రఘునాథరెడ్డికి వ్యతిరేకంగా రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించడంతో... ఇందుకు పోటీగా ప్రెస్‌క్లబ్‌లో ఆదినారాయణ యాదవ్‌కు వ్యతిరేకంగా సమావేశం ఏర్పాటు చేశారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

- కలెక్టరు వినోద్‌కుమార్ హెచ్చరిక
- పింఛన్ల పంపిణీపై సమీక్ష

అనంతపురం టౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీలో అవినీతి, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని కలెక్టర్ వినోద్ కుమార్ హెచ్చరించారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పింఛన్ల పంపిణీలో సచివాలయ సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని అన్నారు. క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలిస్తానని, నిర్లక్ష్యం వహించినా, ఫిర్యాదులు వచ్చినా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. పింఛన్‌ల పంపిణీకి వెళ్లినపుడు లబ్ధిదారులను గౌరవంగా పలకరించాలని సూచించారు. డబ్బులు ఇచ్చిన అనంతరం ప్రభుత్వ మెసేజ్‌లను వినిపించాలని సూచించారు. ఇళ్ల వద్దకే వెళ్లి సొమ్ము అందజేయాలని, ఎక్కడో కూర్చుని పంపిణీ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామస్థాయి అధికారులు, సిబ్బంది పనితీరును డీఆర్‌డీఏ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. సమీక్షలో డీఆర్‌డీఏ పీడీ శైలజ, డీపీఓ నాగరాజునాయుడు తదితరులు పాల్గొన్నారు.

డిఫెన్స్ అకాడమీతో అంతర్జాతీయ గుర్తింపు

- ఎంపీ బీకే పార్థసారథి
- భూముల పరిశీలన



టేకులోడు వద్ద భూములను పరిశీలిస్తున్న ఎంపీ బీకే

చిలమత్తూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలో డిఫెన్స్ అకాడమీ ఏర్పాటైతే ఈ ప్రాంతానికి అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి అన్నారు. మండలంలో త్వరలో ఏర్పాటుకానున్న డిఫెన్స్ అకాడమీకి సేకరిస్తున్న భూములను ఆయన మంగళవారం పరిశీలించారు. టేకులోడు సమీపంలో పర్యటించారు. ఎంపీ మాట్లాడుతూ.. త్వరలో ఈ ప్రాంతం పారిశ్రామికవాడగా రూపుదిద్దుకుంటుందన్నారు. కుగ్రామాలు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతాయన్నారు. త్వరగా పరిశ్రమలు ఏర్పాటు చేసి, ఉపాధి కల్పించాలని ఎంపీని స్థానికులు కోరారు.

అక్రమార్కుడు ఆదినారాయణే..!

- ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాలను వదులుకుంటా
- మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి



అనంతపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): భూ అక్రమార్కుడు ఆదినారాయణేనని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి అన్నారు. ఆదినారాయణ భూ అక్రమాలపైన, తనపై చేసిన ఆరోపణల పైన సిట్టింగ్ జడ్జి లేదా ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసి విచారణ చేయాలని సీఎం చంద్రబాబును కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎవరి భూముల జోలికీ పోవాల్సిన అవసరం తనకు లేదని పేర్కొన్నారు. గత 30 ఏళ్లుగా క్రియాశీలక రాజకీయాల్లో కొనసాగుతున్నానని, ఏ మచ్చా లేకుండా ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు సేవ చేస్తున్నానని వివరించారు. పుట్టపర్తి నియోజకవర్గంలో ఎవరు కష్టాల్లో ఉన్నా ఆర్థికంగా సాయం చేస్తూ, వారి కుటుంబ సభ్యుడిగా అండగా నిలుస్తున్నానని పేర్కొన్నారు. జిల్లాలో విద్యాసంస్థలను స్థాపించి, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఉచిత విద్య, ఉద్యోగ అవకాశాలను కల్పించానని పేర్కొన్నారు. తనది ఒక వ్యవస్థ అని, తాను ఎంతో పద్ధతిగా ఉంటానని, ఎవరిజోలికీ పోనని అన్నారు. ఈ మధ్య గొడ్డుమర్రి ఆదినారాయణ అనే వ్యక్తి అనవసరంగా, ఆధారాలు లేకుండా తనపై అభాండాలు వేస్తున్నారని, తన ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారని పేర్కొన్నారు. కొంతమంది సంఘాల నాయకులకు నిజాలు చెప్పకుండా, వారిని ప్రలోభపెట్టి అసత్య ప్రచారాలు చేయిస్తున్నారని అన్నారు. తమ గ్లోబల్ హార్టికల్చర్ కంపెనీలో ఏడుగురు డైరెక్టర్లలో ఆదినారాయణ ఒకరని, తమ కంపెనీలో మిగతా డైరెక్టర్లకు తెలియకుండా, నిబంధనలకు విరుద్ధంగా, ఫేక్ రెజల్యూషన్ చేసి కంపెనీకి సంబంధించిన 100 ఎకరాలకు పైగా భూమిని తన భార్య, బావమరిది, మామ, అన్న పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించారు. ఆ భూమిని 26 మందికి అమ్మి, వారిని కూడా మోసగించారని ఆరోపించారు. ఆదినారాయణ నుంచి తాము నష్టపోయిన భూమిని న్యాయస్థానం ద్వారా దక్కించుకుంటామని వివరించారు. ఆ భూమిలో ఒక సెంటు కాజేసినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని అన్నారు. ముదిగుబ్బ మండలం అడవి బ్రాహ్మణపల్లికి చెందిన 50 మందికిపైగా అమాయక గిరిజన రైతులకు సంబంధించిన 170 ఎకరాలను దౌర్జన్యంగా ఆదినారాయణ, ఆయన కుటుంబ సభ్యులు, బంధువుల పేరిట 1బి అడంగల్ చేయించారని, బ్యాంకుల్లో రూ.కోట్ల రుణాలు తీసుకున్నారని ఆరోపించారు. అనంత లక్ష్మి కళాశాల ఎదురుగా సుమారు 50 ఎకరాల భూమిని అక్రమంగా పొందిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కియ చుట్టూ పదుల సంఖ్యలో రైతులను బెదిరించి, వారి భూములను ఆన్‌లైన్ చేసుకోలేదా అని ప్రశ్నించారు.

ఏమాత్రం బాధ్యత లేకుండా..!

(5వ పేజీ తరువాయి)

మందులను రాసి, కమీషన్ల రూపంలో వైద్యులు జేబులు నింపుకుంటున్నారు. జలుబు, దగ్గు, జ్వరంతో డాక్టర్ వద్దకు వెళితే దాదాపు రూ.వెయ్యి మందులు అంటగడుతున్నారని బాధితులు వాపోతున్నారు.

అధిక లాభాలిచ్చే మందులే విక్రయం

ప్రజలు ఆరోగ్యాన్ని పక్కన పెట్టి ధనార్జనే ధ్యేయంగా మెడికల్ షాపుల నిర్వాహకులు దందా సాగిస్తున్నారు. అత్యధికంగా లాభాలిచ్చే నాణ్యత లేని మందులను రోగులకు అంటగడుతున్నారు. అనుమతులు లేని మందులను సైతం విక్రయిస్తున్నారు. కార్డియాలజీ, మానసిక వ్యాధి, న్యూరాలజీ, యూరాలజీ, బ్రెయిన్‌స్ట్రోక్, మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్, యూరిన్ ఇన్ఫెక్షన్ తదితర సమస్యలకు డాక్టర్ చీటీ లేకుండా మందులు ఇవ్వకూడదు. ఈవ్యాధుల ఔషధాల్లో హైడోస్, లోడోస్ అనే రకాలుంటాయి. వ్యాధి తీవ్రత, రోగి వయస్సు, శరీర తత్వం బట్టి డాక్టర్లు మందులు సిఫార్సు చేస్తారు. అయితే మెడికల్ షాపులకు వెళ్లి అడిగితే ఏరోగానికైనా ఎన్ని మందులు కావాలన్నా ఇచ్చేస్తున్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన కొంతమంది దగ్గుకు వాడే సిరప్‌లు తాగుతున్నారు. ఇంతజరుగుతున్న సంబంధిత ఔషధ నియంత్రాధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత షాపు నిర్వాహకుల నుంచి మామూళ్లు రావడమే ఇందుకు కారణమనే విమర్శలు ఉన్నాయి. అప్పుడప్పుడు తనిఖీలో చేసి, నామమాత్రంగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది.



వైద్యుల సూచన మేరకు మందులు వాడాలి



వైద్యుల సలహాలు, సూచనల మేరకే మందులు వాడాలి. నేరుగా మందులు వాడితే కొన్నిమార్లు ప్రాణలమీదకు వచ్చే అవకాశముంది. సొంతగా నొప్పుల మాత్రలు, స్టైరాయిడ్స్ కొనివాడితే ఇబ్బందులు తప్పవు. అల్సర్లు ఏర్పడటమే కాకుండా, కిడ్నీ ఫెయిల్ అయ్యే అవకాశం ఉంది. ప్రతి మందుకు సైడ్ ఎఫెక్టు ఉంటుంది. ఏమందు ఎవరికి పనిచేస్తుందో డాక్టర్లకు మాత్రమే తెలుస్తుంది. ఏమందులైనా డాక్టర్ల సిఫార్సు మేరకే వాడాలి. లేకుంటే శరీరంలో ఏదో ఒక భాగంపై ప్రభావం పడే అవకాశముంది.

-డాక్టర్ హుస్సేన్, జనరల్ సర్జన్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, కదిరి

చర్యలు తీసుకుంటాం



నిబంధనలు పాటించని మెడికల్ షాపులపై చర్యలు తీసుకుంటాం. మందుల విక్రయాలకు సంబంధించి బిల్లులు తప్పకుండా ఇవ్వాలి. కాలం చెల్లిన మందులు విక్రయించినా, రికార్డులు సక్రమంగా లేకపోయినా చర్యలు తప్పవు. ఏ షాపులో మందులు కొనుగోలు చేసినా, రసీదు అడిగి తీసుకోవాలి. ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలి. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల పోస్టులు ఖాళీగా ఉండటంతో పూర్తి పర్యవేక్షణ చేయలేకపోతున్నాం.

- రమేష్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్, ఔషధ నియంత్రణ శాఖ

వన మహోత్సవానికి సహకరించాలి

సీఎఫ్ యశోదాబాయి

అనంతపురం న్యూటౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో ఈ నెల 5న చేపట్టనున్న వనమహోత్సవాన్ని జయప్రదం చేయాలని కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ యశోదాబాయి పిలుపునిచ్చారు. వనమహోత్సవంలో లోపాలకు తావులేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే పంపనూరు నగరవనాన్ని డీఎఫ్‌ఓ శ్యామల, స్క్వాడ్ డీఎఫ్‌ఓ గురుప్రభాకర్, రేంజర్లు శ్రీనివాసులు, మధుబాబు, చంద్రశేఖర్‌లతో కలిసి మంగళవారం ఆమె పరిశీలించారు.

- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపు మేరకు నిర్వహిస్తున్న వన మహోత్సవాలను జయప్రదం చేయాలని జిల్లా అటవీశాఖ అధికారి శ్యామల కోరారు. జిల్లాలో 3.85 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. 14 నర్సరీల్లో 12.25 లక్షల మొక్కలను సిద్ధంగా ఉంచామన్నారు. మొక్కలు కావాల్సిన వారు రేంజర్ దీప 8317572080, సెక్షన్ ఆఫీసర్ మల్లికార్జున 9491835163లో సంప్రదించాలని సూచించారు.

క్రైం కార్నర్

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ

ఐదుగురికి తీవ్రగాయాలు


గాయపడిన కుమార్


వెంకటరమణ


ఉత్తన్న

తనకల్లు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగసానిపల్లి సమీపంలో మంగళవారం ఆర్టీసీ బస్సును లారీ ఢీకొనడంతో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్‌ఐ గోపి తెలిపిన మేరకు కదిరి నుంచి మదనపల్లి వెళ్తున్న ఆర్టీసీ బస్సును వెనుక వైపు నుంచి ఓ లారీ వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో బస్సులో ఉన్న నలుగురు ప్రయాణికులు, లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో కదిరికి చెందిన కుమార్, పూల బజార్‌కు చెందిన లక్ష్మీనారాయణ, తనకల్లు మండలంలోని పాల్యం వాండ్లపల్లికి చెందిన తుపాకుల వెంకటరమణ, అన్నమయ్యజిల్లా మొలకలచెరువు మండలం అడివినాయినచెరువుపల్లికి చెందిన గొంది ఉత్తన్న, లారీ డ్రైవర్ రామాంజనేయులు ఉన్నారు. వందేమాతం అంబులెన్స్ ద్వారా క్షతగాత్రులను తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లారీడ్రైవర్ రామాంజనేయులు, గొందిపల్లి ఉత్తన్నలను మెరుగైన వైద్యం కోసం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జింకను ఢీకొట్టిన ద్విచక్రవాహనం

యువకుడికి గాయాలు, వన్యప్రాణి మృతి


జింక కళేబరం

గుంతకల్లు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రసన్న బైక్‌పై వెళ్తూ జింకను ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక భీమిరెడ్డి కాలనీకి చెందిన ప్రసన్న ఉరవకొండలో ఓ ప్రైవేటు ఐటీఐలో చదివి పాసయ్యాడు. సర్టిఫికెట్ల కోసం మంగళవారం ఉరవకొండకు బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా వజ్రకరూరు మండలం రాగులపాడు గ్రామ సమీపంలో రోడ్డుకు అడ్డుగా జింక రావడంతో దాన్ని ఢీకొట్టి, కింద పడ్డాడు. దీంతో ప్రసన్న తలకు తీవ్ర గాయమవగా, జింక అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికులు 108 సర్వీసుకు సమాచారమందించగా, క్షతగాత్రుడిని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి రెఫర్ చేశారు.

చెరుకు తోట దగ్ధం... రూ.10 లక్షల నష్టం


దగ్ధమవుతున్న చెరుకుతోట

గార్లదిన్నె, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదేడు గ్రామ సమీపంలో చెరుకు తోట దగ్ధమై రూ.10 లక్షల ఆస్తి నష్టం జరిగింది. స్థానికులు తెలిపిన మేరకు... అనంతపురానికి చెందిన శాంతరాజు బూదేడు వద్ద ఏడు ఎకరాలు కౌలుకు తీసుకుని డ్రిప్, స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసుకుని చెరుకు పంట సాగుచేశాడు. అయితే మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు చెరుకు తోటకు నిప్పంటుకుని పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. బాధిత కౌలు రైతు శాంతరాజు నుంచి సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే చెరుకు తోట పూర్తిగా అగ్నికి ఆహుతైంది.

నిమ్మ చెట్లు నరికి... డ్రిప్ పరికరాల దహనం


దుండగులు నరికివేసిన నిమ్మచెట్లు


కాలిపోయిన డ్రిప్పు పైపులు

యాడికి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కత్తిమానుపల్లి గ్రామంలో అన్నదమ్ములైన రైతులు శంకర్, లోకేష్‌లకు చెందిన 15నిమ్మచెట్లు నరికివేసి, రూ.2లక్షలు విలువజేసే డ్రిప్పు పరికరాలను కాల్చివేసిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. సాయంత్రం వరకు నిమ్మతోటలో పనులు చేసి వచ్చామని బాధిత రైతులు తెలిపారు. మంగళవారం ఉదయం నిమ్మతోటలో గడ్డిమందు కొట్టడానికి వెళ్లగా చెట్లను నరికివేసి ఉన్నట్లు గమనించామన్నారు. తోటలో నిల్వ ఉంచిన డ్రిప్‌పైపులను కాల్చివేశారని తెలిపారు. మూడేళ్ల వయస్సు ఉన్న 15నిమ్మచెట్లను దుండగులు నరికివేశారని, సుమారు రూ.2లక్షలు విలువజేసే డ్రిప్ పరికరాలు కాల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దుండగులు నేలపైన వెయిట్ అండ్ సి అని రాసి వెళ్లారని రైతులు తెలిపారు. తాము ఏ రాజకీయపార్టీకి చెందినవారు కాదని, గ్రామంలో ఎవరితో కూడా ఎటువంటి గొడవలు లేవని, దుండగులు ఎందుకు ఇలా చేశారో తెలియడం లేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నిమ్మచెట్లు నరికివేసిన సమాచారం అందుకున్న ఎస్‌ఐ వెంకటరమణయ్య సిబ్బందితో వెళ్లి దుండగులు నరికివేసిన నిమ్మచెట్లను కాల్చివేసిన డ్రిప్ పైపులను పరిశీలించారు. బాధిత రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తస్మాత్ జాగ్రత్త

- రాబోయే మూడు నెలలు భారీ వర్షాలు కురిసే అవకాశం
- జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి
- శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

పుట్టపర్తిటౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వచ్చే మూడు నెలల పాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని, సహాయక చర్యలకు జిల్లా యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రానున్న వర్షాకాలంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై మంగళవారం సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల జిల్లాలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనుకోని ప్రమాదం సంభవిస్తే త్వరగా చేపట్టాల్సిన చర్యలపై సిద్ధంగా ఉండాలన్నారు. అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి మూడురోజుల్లో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాలోని ఆర్డీవోలు, వారానికి ఒకసారి డివిజన్ స్థాయిలో అధికారులతో సమీక్షించి, తగు సూచనలు చేయాలన్నారు. అలాగే జిల్లాలో చెరువులు, కాలువలకు గండ్లు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మండలస్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, నీటిపారుదల శాఖల ఏడీలు బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయిల్లో పరిశీలించాలన్నారు. మున్సిపల్ ప్రాంతాల్లో రోడ్లు, మురుగు నీటికాలువల వ్యవస్థలను పర్యవేక్షించాలన్నారు. గ్రామాల్లో ప్రతిరోజు పారిశుధ్య పనులు నిర్వహించి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ శాఖాధికారులను ఆదేశించారు. వర్షాల వల్ల ఈదురుగాలులు, విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, స్తంభాలు నేలకొరగడం, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, వైర్లు నేలకు వాలడం జరిగితే వెంటనే పునరుద్ధరించడానికి సామగ్రి సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్పీ రత్న, జేసీ అభిషేక్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, డీఎంహెచ్ఓ ఫిరోజ్ బేగం, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఓ సమత, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, పశుసంవర్ధకశాఖ శుభదాస్, తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మడకశిర రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యా సంవత్సరం 2025-26కి గాను పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణులైనవారు, ఇంటర్‌లో ఫెయిల్ అయిన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్ నెంబర్ 7382633687. 7702705721 కు సంప్రదించాలని తెలిపారు.

ప్రవేశాలకు నేడు లాటరీ

అనంతపురం సెంట్రల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది గిరిజన గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు బుధవారం లాటరీ తీయనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మంగళవారం ప్రకటనలో తెలిపారు. పాఠశాలల్లో మూడో తరగతినుంచి తొమ్మిదో తరగతి వరకు ఖాళీ ఉన్న సీట్లను భర్తీచేయడానికి దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. దరఖాస్తులు ఎక్కువ రావడంతో లాటరీ పద్ధతిలో సీట్లు కేటాయిస్తారన్నారు. అనంతపురంలోని నవోదయ కాలనీలో ఉన్న గిరిజన గురుకుల పాఠశాల(బాలికల)లో ఉదయం 10 గంటలకు లాటరీ తీస్తామని తెలిపారు.

డీజిల్ దొంగల ముఠా గుట్టు రట్టు

- వ్యవసాయ తోటలో నిల్వ
- 1500 లీటర్ల డీజిల్ పట్టివేత
- ముగ్గురు నిందితుల అరెస్టు


స్వాధీనం చేసుకున్న డీజిల్ డ్రమ్ములతో పోలీసులు

చెన్నేకొత్తపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): డీజిల్ దొంగల ముఠా గుట్టు రట్టు అయ్యింది. రామగిరి మండలం పెనుబోలు సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ వ్యవసాయ తోట కేంద్రంగా డీజిల్ అక్రమ వ్యాపారం సాగిస్తున్న వైనాన్ని పోలీసులు కనుగొన్నారు. చెన్నేకొత్తపల్లి ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన మేరకు...చెన్నేకొత్తపల్లి సమీపంలోని ఓ డాబా వద్ద సోమవారం రాత్రి డ్రైవర్ లారీని ఆపి నిద్రపోయాడు. తిరిగి మంగళవారం తెల్లవారు జామున లేచి గమనించగా 300లీటర్లు డీజిల్ మాయమైంది. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ సిబ్బందితో కలిసి మండలంలోని దామాజిపల్లి క్రాస్ వద్ద జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా కర్ణాటక రిజిస్ట్రేషన్‌తో వెళ్తున్న ఓ కారును ఆపి తనిఖీ చేశారు. అందులో 90 లీటర్ల డీజిల్ దొరికింది. కారులో ఉన్న బసవరాజు అనే వ్యక్తిని విచారించగా సీకేపల్లి సమీపంలోని హంద్రీనీవా కాలువ వద్ద ఉంచిన డీజిల్‌ను దొంగిలించానని, పెనుబోలు వద్ద రాము అనే వ్యక్తికి విక్రయించడానికి వెళ్తున్నట్లు పోలీసులకు తెలిపాడు. దీంతో రామగిరి సీఐ శ్రీధర్, ఎస్‌ఐ సత్యనారాయణ సిబ్బందితో పెనుబోలుకు వెళ్లి రామును తమదైన శైలిలో విచారించడంతో డీజిల్ అక్రమ వ్యాపారం బట్టబయలైంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అంకిత్, బిహార్‌కు చెందిన మరికొందరితో కలిసి డీజిల్ దొంగిలిస్తున్నట్లు వెల్లడైంది. పెనుబోలు వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న రాము తోటలో దొంగిలించిన డీజిల్ నిల్వ ఉంచుతున్నట్లు తేలింది. దీంతో అక్కడ డ్రమ్ముల్లో ఉంచిన 1500 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. రాము, అంకిత్, బసవరాజును అరెస్టు చేశారు. ఆరునెలల నుంచి జాతీయ రహదారి పక్కన ఆపి ఉన్న వాహనాల నుంచి డీజిల్‌ను దొంగిలించి అక్రమ వ్యాపా రం చేస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నారని ఎస్‌ఐ తెలిపారు. డీజిల్‌ను 2వేల లీటర్ల వరకు డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన తరువాత తాడిపత్రి, గుత్తి తదితర ప్రాంతాలలోని కొన్ని ప్రైవేటు కంపెనీలకు విక్రయించేవారని ఎస్‌ఐ తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచి నట్లు ఎస్‌ఐ తెలిపారు. డీజిల్ దొంగతనం, అక్రమ వ్యాపారంతో సంబంధం ఉన్న ఇద్దరు బిహారీలు పరారైనట్లు తెలిసింది.

నేడు మెము రైలు ప్రారంభం

- అనంత నుంచి బెంగళూరుకు ప్రయాణం సులభతరం



అనంతపురం, న్యూటౌన్ జూన్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం నుంచి బెంగళూరు వెళ్లే మెము రైలు (66560) సర్వీసును ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణ బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభించనున్నారు. ఈ మేరకు రైల్వే యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ప్రారంభోత్సవ కార్యక్రమం పూర్తి కాగానే షెడ్యూల్ టైం మేరకు మధ్యాహ్నం 2.10 అనంతపురం స్టేషన్ నుంచి రైలు బయలుదేరి రాత్రి 7.50 గంటలకు కేఎస్ఆర్ బెంగళూరు చేరనుంది. మెమూ రైలు ప్రారంభమైతే కేవలం రూ.50తో జిల్లా కేంద్రం నుంచి బెంగళూరు చేరుకునే అవకాశం ఉంటుంది. ఇది పేద, మధ్యతరగతి ప్రయాణికులకు చాలా ప్రయోజకరంగా ఉంటుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ రైలు సర్వీసు కోసం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అలుపెరగని ప్రయత్నం చేసి, విజయవంతం అయ్యారు. ప్రారంభోత్సవానికి ఎంపీతో పాటు స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు గుంతకల్లు డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తాతో పాటు ఇతర అధికారులు హాజరుకానున్నారు.

బీఎస్ఎఫ్ జవాన్ మామకు భూమి అప్పగింత

- సర్వే చేయించిన రెవెన్యూ అధికారులు


భూమిని సర్వే చేస్తున్న అధికారులు

అమరాపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ కబ్జా చేసిన భూమిని బీఎస్ఎఫ్ జవాన్ మామ కదిరప్పకు అధికారులు మంగళవారం అప్పగించారు. మండలంలోని కే శివరం గ్రామంలో బీఎస్ఎఫ్ జవాన్ నరసింహమూర్తి మామ కదిరప్ప భూమిని అదే గ్రామానికి చెందిన మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు కబ్జా చేశాడు. దీనిపై బీఎస్ఎఫ్ జవాన్ ఆవేదన వ్యక్తం చేస్తూ సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో విడుదల చేశాడు. అది వైరల్ కావడంతో అధికార యంత్రాంగం శివరం గ్రామానికి పరుగులు పెట్టింది. తహసీల్దార్ లక్ష్మీనరసింహ పొలం రికార్డులను పరిశీలించారు. ఇదివరకే కోర్టు కూడా ఆ భూమి కదిరప్పకు చెందినదే అనే తీర్పు ఇచ్చిన విషయాన్ని తెలుసుకున్నారు. అప్పుడే పోలీస్ బందోబస్తు మధ్య సర్వేయర్‌ల ద్వారా కొలతలు వేసి హద్దు రాళ్లను నాటించి కదిరప్పకు భూమి అప్పగించారు. ఎన్నో సంవత్సరాల కల నేటికి నెరవేరిందని బీఎస్ఎఫ్ జవాన్ నరసింహమూర్తి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఐ రాజ్‌కుమార్, ఆర్ఐ విన్సెంట్‌పాల్, మండల సర్వేయర్లు పుట్టరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా... ప్రమోషన్లు ఇప్పించు..

- గాంధీ విగ్రహానికి సంఘాల నేతల వినతి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అనంతపురం విద్య, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్లు వెంటనే వచ్చేలా చూడాలంటూ పలువురు అర్హులైన ఎస్జీటీలు గాంధీ విగ్రహానికి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. పలు సంఘాల నాయకులు ఆరోరోజూ శారదా స్కూల్‌లో నిరసన తెలిపిన తర్వాత క్లాక్‌టవర్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించా రు. తర్వాత సంఘాల నేతలు మాట్లాడుతూ 2023లో తాత్కాలిక ప్రమోషన్లు ఇచ్చారన్నారు. అలా ఇచ్చిన 230 స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ పోస్టులకు సంబంధించి ఖాళీలు చూపాలని కోరారు. డీఎస్సీకి 103 పోస్టులు పోగా...మిగిలిన పోస్టులు ఏమయ్యాయంటూ ప్రశ్నించారు. అర్హులైన సీనియర్ ఎస్జీటీలకు అన్యాయం జరగకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సూర్యుడు, చంద్రశేఖర్, జయపాల్‌నాయుడు, నరసింహులు, లింగమయ్య, రఫీ, అంజి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.33 వేలు

అనంతపురం రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.33,300 ధర పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి రూ.19వేలతో అమ్ముడుపోయినట్లు పేర్కొన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 468టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.


చలో ఎల్ఓసీ యాత్ర సభ్యులకు ఘన స్వాగతం


యాత్రలో పాల్గొన్న సభ్యులతో ఈఓఆర్డీ తదితరులు

అనంతపురంరూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): చలో ఎల్ఓసీ బైకు యాత్ర సభ్యులకు నగర శివారులో ఘన స్వాగతం లభించింది. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా కేరళకు చెందిన కొంతమంది కెప్టెన్ రాంనాథ్‌జీ నేతృత్వంలో కేరళలోని కాలాడీ ప్రాంతం నుంచి చలో ఎల్ఓసీ యాత్ర చేపట్టారు. అందులో భాగంగా ఈయాత్ర మంగళవారం మండలంలోని సోములదొడ్డికి చేరుకుంది. వీరికి ఆత్మకూరు ఈఓఆర్డీ లక్ష్మీనరసింహ, విద్యుత్ శాఖ విశ్రాంత ఉద్యోగి వెంకటరమణ, వెంకటేశ్వర్లు తదితరులు స్వాగతం పలికారు. ఇస్కాన్ టెంపుల్ ఆవరణలో అల్పాహారం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ విజయవంతం.. పహల్గామ్ ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి సంతాపం తెలుపుతూ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఉగ్రదాడిలో 26మంది మృతి చెందితే 26 బుల్లెట్ బైక్‌లతో యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. యాత్రలో పలు చోట్ల ప్రజలు మద్దతుగా యాత్రలో పాల్గొన్నట్లు తెలిపారు. ఈక్రమంలో 26మందితో ప్రారంభమైన యాత్ర 35మందికి చేరిందన్నారు. యాత్ర ముగిసేలోపు మరింత మంది పాల్గొనే వీలుందన్నారు. జమ్ముకశ్మీర్‌లోని శారదమఠ్ వరకు యాత్ర సాగుతుందన్నారు. అక్కడ మిలటరీ క్యాంపును చేరుకుని సైనికులను కలుసుకుని సంఘీభావం తెలియజేస్తామన్నారు.

రాష్ట్రస్థాయి నాటక పోటీలకు నమోదు చేసుకోండి

అనంతపురం కల్చరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా నాటకోత్సవ సమితి ఆధ్వర్యంలో సెప్టెంబరు 2 నుంచి ఆరో తేదీ వరకు నిర్వహించనున్న నాటక పోటీలకు పేర్లు నమోదు చేసుకోవాలని సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైఖేల్ బాబు మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన నాటకరంగ కళాకారులు అర్హులన్నారు. అనంతపురంలోని కృష్ణ కళామందిర్‌లో పౌరాణిక పద్య నాటకాలు, ఏకాంక్ష పద్య నాటకాల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. పౌరాణిక పద్య నాటకాల విభాగంలో ప్రథమ స్థానానికి రూ.లక్ష, ద్వితీయ స్థానానికి రూ.70వేలు, తృతీయ స్థానానికి రూ.40వేలు నగదు, జ్ఞాపికలు అందజేస్తామన్నారు. ఏకాంక నాటకాల విభాగంలో మొదటి స్థానానికి రూ.20వేలు, ద్వితీయ స్థానానికి రూ.15వేలు, తృతీయ స్థానానికి రూ.10వేలు, జ్ఞాపికలు అందజేసి సత్కరించనున్నట్లు తెలిపారు. ఇక పోటీల్లో స్క్రూట్నీ ద్వారా ఎంపిక చేయబడి ప్రదర్శించే పౌరాణిక పద్య నాటకానికి రూ.15వేలు, ఏకాంక నాటకానికి రూ.2వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామని తెలిపారు. అర్హత, ఆసక్తి గల నాటక సంస్థలు, సంఘాల వారు 63006 54184 నెంబర్‌ను సంప్రదించి ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.



గోరక్షణ చట్టాలు కఠినంగా అమలు చేయాలి

- వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు తాళంకి వెంకటరత్నమయ్య


కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న గోసంరక్షణ, వీహెచ్‌పీ నాయకులు

అనంతపురం కల్చరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): గోరక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) జిల్లా అధ్యక్షుడు తాళంకి వెంకట రత్నమయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన జిల్లా గోరక్షా ప్రముఖ్ సోమశేఖర్‌తో కలిసి కలెక్టర్ వినోద్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1971లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గోసంరక్షణ చట్టాన్ని అమలు చేశారన్నారు. రాష్ట్ర విభజనానంతరం తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే ఈ చట్టం అమలులో ఉందన్నారు. అయితే కొన్ని హిందూయేతర సామాజిక పండుగల సందర్భంగా గోవులను వధిస్తున్నారని, అటువంటివారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ముస్లిం పండుగల కోసం వాహనాలలో గోవులు, ఎద్దులు, లేగదూడలను తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసి, వాహన యజమానులకు జరిమానాలతోపాటు జైలుశిక్ష వంటి కఠిన చర్యలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వ అనుమతులు లేని కబేళాలను మూసివేయించాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు రమణబాబు, కార్యదర్శి విశ్వనాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తన పంపిణీయే ధ్యేయం

● ఎమ్మెల్యే పరిటాల సునీత
● చెన్నేకొత్తపల్లి రైతుసేవాకేంద్రంలో విత్తన వేరుశనగ పరిశీలన


విత్తన వేరుశనగ కాయలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని, కనుక రైతులకు అధికారులు నాణ్యమైన విత్తన వేరుశనగ కాయలనే పంపిణీ చేయాలని, ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. మండలకేంద్రంలోని రైతుసేవా కేంద్రంలో గల సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలను మంగళవారం ఆమె పరిశీలించారు. మండలానికి 1910 క్వింటాళ్లు విత్తన కాయల్ని కేటాయించారని, ఇప్పటివరకు 500 క్వింటాళ్లు వచ్చాయని ఏఓ ఉదయ్‌కుమార్ ఎమ్మెల్యేకు వివరించారు. అయితే ప్రస్తుతం వచ్చిన స్టాకులో కొన్ని బస్తాల్లో ఐదారురకాల విత్తన కాయలు కలిసి ఉన్నాయని అక్కడేఉన్న పలువురు రైతులు వాపోయారు. ఇందుకు ఆమె ఓ బస్తాలోని కాయల్ని పరిశీలించి ఒక్కో రకం విత్తనాన్ని వేరు చేసి వీటిని పైఅధికారులకు పంపాలని ఏఓకు సూచించారు. ఇలాంటి విత్తన కాయలు ఉన్న బస్తాలన్నింటినీ తిరిగి వెనక్కి పంపాలని ఆదేశించారు. విత్తనకాయలు గోదాముల వద్దకు వచ్చినప్పుడే నాణ్యతను పరిశీలించాలన్నారు. లేకపోతే రైతులు ఇబ్బంది పడతారన్నారు. నాణ్యత లేకుంటే రైతులు ఎవరూ విత్తనం తీసుకోవద్దని సూచించారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఏజెన్సీలతో మాట్లాడి నాణ్యత విషయంలో రాజీలేకుండా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. 40 శాతం సబ్సిడీతో విత్తన కాయల్ని అందిస్తోంది. రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఎల్. నారాయణచౌదరి, రామ్మూర్తినాయుడు, బీసీసెల్‌జిల్లా అధ్యక్షుడు కుంటిమద్దిరంగయ్య, మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, నాయకులు అంకే అమరేంద్ర, మాడెం సూర్యనారాయణ రెడ్డి, యజ్ఞేశంకర్, చంద్రాయుడు పాల్గొన్నారు.

అసలైన వెన్నుపోటుదారుడు జగన్‌రెడ్డే

● రాష్ట్రంలో ఆయన, రాప్తాడులో ప్రకాష్‌రెడ్డికి మించిన వెన్నుపోటుదారులు లేరు
● ఎమ్మెల్యే పరిటాల సునీత ధ్వజం



అనంతపురం రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వెన్నుపోటు అనే పదానికి అసలైన హక్కుదారుడు వైసీపీ అధినేత జగన్‌రెడ్డేనని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ధ్వజమెత్తారు. జిల్లాకేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ బుధవారం వెన్నుపోటు దినం నిర్వహిస్తుండటంపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం వచ్చిన తొలి ఏడాదిలోనే 70 శాతం హామీలు నెరవేర్చిందని అన్నారు. అయితే హామీలేవీ నేరవేర్చలేదంటూ ప్రజల మనసులో విషాన్ని నింపే ప్రయత్నం వైసీపీ వారు చేస్తున్నారన్నారు. వాస్తవానికి జగన్‌రెడ్డి రక్తంలోనే వెన్నుపోటు ఉందన్నారు. ఆయన తాత కాలం నుంచే ఇలాంటివి ఆ కుటుంబానికి అలవాటన్నారు. కాంగ్రెస్‌ని అడ్డం పెట్టుకుని రూ.లక్షల కోట్లు దోచేసి అదే పార్టీకి వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. వైసీపీ పాలనలో మద్యపాన నిషేధం, మెగా డీఎస్సీ, అన్నక్యాంటీన్లు, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సబ్‌ప్లాన్ నిధులు, అమరావతి విషయంలో ప్రజలకు వెన్నుపోట్లు పొడిచింది మీరు కాదా అంటూ నిలదీశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ, అన్న క్యాంటీన్లు, పింఛన్ల పెంపు, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, గుంతల రోడ్లు పూడ్చివేత ఇలా చెబుతూ పోతే 70శాతం హామీల్ని నెరవేర్చామని ఆమె పేర్కొన్నారు.

కార్యకర్తలు, ప్రజలకు వెన్నుపోటు పొడిచిన ప్రకాష్‌రెడ్డి..

2019 ఎన్నికలకు ముందు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఏడ్చిన ఏడుపులు చూసి ప్రజలు ఓట్లు వేశారని, అయితే గెలిచిన తర్వాత అతను సొంత పార్టీ కార్యకర్తలను, ప్రజలను వెన్నుపోటు పొడిచారని పరిటాల సునీత దుయ్యబట్టారు. అధికారంలో ఉండగా.. కార్యకర్తల్ని పట్టించుకోలేదు సరి కదా.. వారి భూముల్ని కాజేశారని ఆరోపించారు. ఇప్పుడు ఎక్కడ శవం కనిపించినా..దానిపై రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో పేరూరు జలాశయానికి నీరు తెస్తానంటూ ప్రగాల్భాలు పలికి, కనీసం తట్టెడు మట్టికూడా తీయని వెన్నుపోటుదారుడు ప్రకాష్‌రెడ్డి అని అన్నారు. అలాగే రాప్తాడులో ఏర్పాటవుతున్న జాకీ పరిశ్రమను కమీషన్ల కోసం వెళ్లగొట్టి.. ఈ ప్రాంత ప్రజలకు వెన్నుపోటు పొడిచింది, టీడీపీ హయాంలో రోడ్లు మంజూరైతే కమీషన్ల కోసం పనులు చేయకుండా అడ్డుకున్నది ఆయనేనని తెలిపారు.

యోగాతో ఒత్తిడి నుంచి విముక్తి: డీఎంహెచ్ఓ


ఆర్ట్స్ కాలేజీలో యోగాసనాలు వేస్తున్న నగరవాసులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): యోగాతో ఒత్తిడి నుంచి విముక్తి పొందవచ్చని డీఎంహెచ్ఓ ఈబీ దేవి సూచించారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ నిత్యం యోగా చేయడంతో ఒత్తిడి దూరమవుతుందన్నారు. శారీరక, మానసిక రుగ్మతల నుంచి విముక్తి పొందొచ్చన్నారు. ఈనెల 21వతేదీన నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఆరోగ్య, ఆనంద ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీఓ అరుణకుమారి, వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, హార్టికల్చర్ అధికారులు ఫిరోజ్, నరసింహారావు, పశుసంవర్ధకశాఖ జేడీ వెంకటస్వామి, డీపీఆర్ఓ గురుస్వామి శెట్టి, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ పద్మశ్రీ, వివేకానందయోగా కేంద్రం అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, ఆయుష్ అధికారులు, యోగామాస్టర్లునగరవాసులు పాల్గొన్నారు.

●అనంతపురం సెంట్రల్: యోగాంధ్రలో భాగంగా నగరంలోని కేఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ బాలికల కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ సత్యలత, డాక్టర్ కేవీ రమణ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. యోగాతో ఆరోగ్యవంతమైన జీవితాన్ని అలవర్చుకోవచ్చునన్నారు. కనుక ప్రతిఒక్కరూ యోగా చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ శ్రీనివాసప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీరంగయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

శింగనమల, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులతో పాటు సర్పంచ్‌లు, మండల అధికారులు అందరూ తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

9న రామగిరిలో..

రామగిరి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 9వ తేదీన మండల సర్వసభ్యసమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గంగావతి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

యువకుడిపై పోక్సో కేసు

గార్లదిన్నె, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలో దస్తగిరి అనే యువకుడిపై మంగళవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తెలిపారు. మర్తాడుకు చెందిన ఓ బాలికను అదే గ్రామానికి చెందిన దస్తగిరి గత రెండేళ్లుగా లైంగిక వైధింపులకు గురి చేస్తున్నాడు. దీంతో బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ జరిపి అతడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చీటింగ్ కేసు..

అనంతపురం క్రైం,జూన్3(ఆంధ్రజ్యోతి) : చిట్టీ డబ్బు ఇవ్వని విషయంపై ఓ మహిళ ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు ఓ వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేశారు. నగరంలోని మూడో రోడ్డుకు చెందిన లక్ష్మీదేవి గీ సోమవారం ఎస్పీ జగదీష్‌ను కలిసి రామ్మోహన్ అనే వ్యక్తి చిట్టీ డబ్బులు రూ.18లక్షలు ఇవ్వలేదని ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు విచారించారు. మంగళవారం చీటింగ్ కేసు నమోదు చేశారు.

యూ టర్న్ ఏర్పాటు చేయండి

శింగనమల, జూన్3 (ఆంధ్రజ్యోతి): శింగనమల సమీపంలోని మరవకొమ్మ వద్ద గల 544డీ జాతీయ రహదారిపై యూటర్న్ ఏర్పాటు చేయాలని స్థానికులు ఆర్డీఓ కేశవనాయుడును కోరారు. మండలకేంద్రంలో మంగళవారం ఆర్డీఓ పర్యటించారు. స్థానికులు వెంకటేశ్, ఆదినారాయణ, సూర్యప్రకాశ్, సత్తి, మూసద్‌వలి , మునేంద్ర తదితరులు ఆయన్ను కలిసి మరవకొమ్మ వద్ద గల జాతీయ రహదారిపై శింగనమల గ్రామానికి రావడానికి యూటర్న్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే యూటర్న్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఇప్పటికే రోడ్డు పరిస్థితిపై కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామని, మరవకొమ్మ వద్ద రోడ్డుపై యూటర్న్ ఏర్పాటు చేయడానికి ఎన్‌హెచ్ అధికారులకు ప్రతిపాదనలు కూడా పంపామని తెలిపారు. అక్కడి నుంచి అనుమతులు వస్తే యూటర్న్ పనులు చేపడతారని పేర్కొన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన

శింగనమల, జూన్3 (ఆంధ్రజ్యోతి): జూలాకాలువ గ్రామంలో మంగళవారం ఐసీడీఎస్ సూపవైజర్ ఉమాదేవి బాలికలకు కిశోర వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తొలుత గ్రామ వీధుల్లో కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో బాలికలకు ఆరోగ్య పరిరక్షణ, పౌష్టికాహారం వల్ల కలిగే లాభాలు, వ్యక్తిగత పరిశుభ్రత, చదువు వల్ల కలిగే ప్రయోజనాలు, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

వైసీపీ కుయుక్తులను ప్రజలు నమ్మరు: ఎమ్మెల్యే శ్రావణిశ్రీ



శింగనమల, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎన్ని కుయుక్తులను పన్నినా నమ్మే స్థితిలో ప్రజలు లేరని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. వైసీపీ వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా బుధవారం తలపెట్టనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని మంగళవారం ప్రకటనలో ఆమె తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో వెన్నుపోటు అనే పదానికి అసలైన హక్కుదారుడు వైఎస్‌జగన్ మోహన్ రెడ్డేనని అన్నారు. గత వైసీపీ పాలనలో ఆయన చేసిన ఆర్థిక విధ్వంసం ప్రజలు మరచిపోలేదన్నారు. ఆస్తి కోసం సొంత తల్లిని, చెల్లిని ఇంట్లో నుంచి నెట్టేసిన, అధికారం కోసం సొంతబాబాయ్‌పై గొడ్డలిపోటు వేసిన జగన్‌కంటే వెన్నుపోటుదారుడు ఎవరున్నారని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే ఎన్నో హామీలను నెరవేర్చిందన్నారు. హామీలేవీ అమలు కాలేదని ప్రజల్లో అవాస్తవాలు ప్రచారం చేయడానికి ఇప్పుడు వెన్నుపోటు అంటూ కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ వారు ఎన్ని కుయుక్తులు పన్నినా నమ్మే స్థితిలో జనం లేరని ఆమె పేర్కొన్నారు.

9న దేశవ్యాప్త కార్మిక సమ్మె: సీఐటీయూ

అనంతపురం కల్చరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో జూలై 9వ తేదీన దేశవ్యాప్తంగా కార్మిక సమ్మె చేపట్టనున్నామని, కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ పిలుపునిచ్చారు. నగరంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. ఉన్న చట్టాలను రద్దుచేసి, వాటి స్థానంలో లేబర్ కోడ్‌లు తీసుకువచ్చి కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలేస్తోందని వాపోయారు. అంబానీ, అదాని జపం చేస్తున్నారని, ఇటువంటి చర్యలను ప్రతిఘటించేందుకు కార్మికవర్గం నడుం బిగించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. అనంతరం 30 మందితో నగర నూతన కమిటీని ఎంపిక చేశారు. సీఐటీయూ నగర అధ్యక్షుడిగా వెంకటనారాయణ, కార్యదర్శిగా ముత్తుజా, ఆఫీస్ బేరర్లుగా రామిరెడ్డి, గోపాల్, తిరుమలేష్, ఎర్రిస్వామి, నాగరాజు, లక్ష్మీనరసమ్మ, వరలక్ష్మి, లతీఫ్, ఆజాం, ఆదినారాయణ, కిష్టా, చంద్ర, కమిటీ సభ్యులుగా సులేమాన్, అక్బర్, శివారెడ్డి, ఆదినారాయణ, సురేంద్రకుమార్, ప్రసాద్, రాజు, నరసింహులులను ఎంపిక చేశారు.

ప్రజల దృష్టి మరల్చేందుకే ఈ డ్రామాలు

● గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్



అనంతపురం అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో జరిగిన కుంభకోణాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే ఆ పార్టీ నేతలు ఇప్పుడు ధర్నాల డ్రామాలు ఆడుతున్నారని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్ విమర్శించారు. నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వెన్నుపోటు.. గొడ్డలి వేటు పేటెంట్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. కాంగ్రెస్‌ను అడ్డుపెట్టుకొని, రూ.లక్షల కోట్లు దోచుకుని, ఆ పార్టీని వెన్నుపోటుపొడిచి వైసీపీని స్థాపించారన్నారు. గత వైసీపీ పాలనలో 85 శాతం హామీలకు ఎగనామం పెట్టి, ప్రజలకు వెన్నుపోటు పొడిచారని, అధికారం కోసం, ఆస్తి కోసం సొంత కుటుంబసభ్యులకే అన్యాయం చేశారని అన్నారు. వైసీపీ అరాచక పాలనకు ప్రజలు స్వస్తి చెప్పి 11 స్థానాలకే పరిమితం చేసినా, ఆ పార్టీ నేతలకు బుద్ధి రాలేదని ఆయన మండిపడ్డారు.

క్రికెట్ పోటీల్లో ఇటుకలపల్లి జట్టు విజయం


విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న దృశ్యం

కనగానపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధర్యంలో జరిగిన క్రికెట్ పోటీల్లో ఇటుకలపల్లి జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం కనగానపల్లి, ఇటుకలపల్లి జట్లు పోటీపడగా ఇటుకలపల్లి జట్టు విజయం సాధించింది. కనగానపల్లి జట్టు రన్నర్‌గా నిలిచింది. ఇటుకలపల్లి జట్టుకు డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్ బోయపాటి సుధాకర్ చౌదరి, టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య, సర్పంచ్ అంకే రామకృష్ణ, తెలుగు యువత నాయకుడు బట్టా సురేష్ చౌదరి బహుమతులు అందజేశారు.

ఈడిగ, గౌడ్ కులగణనను ప్రత్యేకంగా చూడాలి

అనంతపురం అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఈడిగ, గౌడ్ కులస్థుల కులగణనను ప్రత్యేకంగా చూడాలని ఈడిగ సంక్షేమ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో ఆ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగభూషణం, రాయలసీమ ప్రతినిధి వేణుగోపాల్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. ప్రైవేటు మద్యం షాపులను వేర్వేరుగా కేటాయించడాన్ని దృష్టిలో ఉంచుకొని ఈడిగ, గౌడ్ కులస్థులను కూడా వేర్వురుగా కులగణన చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆంజనేయులు, సూరిబాబు, నాగరాజు, చంద్రశేఖర్, అమర్నాథ్, రఘునాథ్, అశోక్, జగదీష్, రాము, శ్రీరాములు, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నార్పల,జూన్3(ఆంధ్రజ్యోతి): మండలం గూగూడు గ్రామంలో మంగళవారం గ్రామ వికాస్ సంస్థ, రిజ్వర్ బ్యాంక్ ఆర్థిక సహకారంతో మండలంలోని రైతులు, రైతు కూలీలు, మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సును నిర్వహించారు. పొదుపు ఆవశ్యకత, బ్యాంక్‌లో వివిధ ఖాతాల నిర్వహణ, బ్యాంకింగ్ ఆన్‌లైన్ సర్వీసులు, ప్రభుత్వ పథకాలు, బీమా, వివిధ రకాల పాలసీలు, బ్యాంకుల నుంచి పొందే పలు రకాల ఉపయోగాల గురించి వారికి వివరించారు. రిజ్వర్ బ్యాంక్ ప్రతినిధి హరినాథ్‌రెడ్డి, గ్రామ వికాస్ సంస్థ అధ్యక్షుడు హనుమంతరెడ్డి, రీసోర్స్ పర్సన్‌లు గ్రామ వికాస్ సిబ్బంది పాల్గొన్నారు.

దోబీ ఘాట్లు ఏర్పాటు చేయాలని వినతి

అనంతపురం టౌన్, జూన్3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీకేఎస్, గార్లదిన్నె, యాడికి, శింగనమల, పెద్దవడుగూరు తదితర మండలాల్లో దోబీఘాట్లు లేక రజకులు ఇబ్బంది పడుతున్నారని, అక్కడ మౌలిక వసతులతో కూడిన దోబీఘాట్లను ఏర్పాటు చేయించాలని రజక వృత్తిదారుల సమాఖ్య నాయకులు కోరారు. ఈ మేరకు నగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

గ్రామాల్లో అధికారుల పర్యటన

శింగనమల, జూన్3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏకులనాగేపల్లి, గుమ్మేపల్లి గ్రామాల్లో పలు సమస్యలు నెలకొనడంపై గత మే 30వ తేదీన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఎంపీడీఓ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రవీంద్ర, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి, సర్పంచ్ డేగల లలితమ్మ మంగళారం ఆ గ్రామాల్లో పర్యటించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ గ్రామాల్లో ప్రజలకు ఫ్లోరైడ్ రహిత నీటి సరాఫరా చేస్తామన్నారు. రోడ్ల పరిస్థితులను ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఏకులనాగేపల్లిలో ఆగిపోయిన అంగన్వాడీ భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ


ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

చెన్నేకొత్తపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్ఎస్‌గేటులో గల ప్రభుత్వాస్పత్రిని డీఎంహెచ్ఓ ఫైరోజ్‌బేగం మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సిబ్బంది వివరాలను వైద్యాధికారి రవీనాయక్‌ను అడిగితెలుసుకున్నారు. ఆస్పత్రిలో మందులు అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. వర్షాకాలం ప్రారంభమైందని, సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సక్రమంగా వైద్యసేవలందించాలని సూచించారు. అనంతరం ఆశాడే సందర్భంగా ఆశాల అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తులు.. అధికారపార్టీ వారే..

● ఫొటోలున్నా గుర్తు పట్టని పోలీసులు

అనంతపురం క్రైం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఓ స్థల విషయంలో ముగ్గురిపై దాడి చేసిన ఘటనలో గుర్తు తెలియని వ్యక్తులు అధికారపార్టీ నాయకులేనని తెలుస్తోంది. నగర శివారులోని కక్కలపల్లి గ్రామ పొలం సర్వే నంబర్ 242లోని 3.50ఎకరాల విషయంలో గొడవ జరిగింది. మూడు రోజుల క్రితం ఆ స్థలంలోకి కొందరు అధికారపార్టీ నాయకులు వెళ్లారు. విషయం తెలుసుకుని నగరంలోని అరవిందనగర్‌కు చెందిన శ్రీనివాసగుప్తా, పీవీ ప్రసాద్, ఆయన కుమారులు సాయినాథ్, ప్రణీత్‌లు అక్కడికి వెళ్లారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ప్రసాద్, అతని కుమారులపై దాడి జరిగింది. ఈ ఘటనపై బాధితులు డయల్100కు ఫోన్ చేయగా.. నాలుగో పట్టణ పోలీసులు అక్కడికెళ్లారు. కాగా బాధితులు ఫిర్యాదులో గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారని పేర్కొన్నారు. దాడి సమయంలో వారిని తీసిన ఫొటోలను పొందుపరిచారు. అయితే వారందరూ అధికారపార్టీ నాయకులని తెలిసినా పోలీసులు రెండు రోజుల పాటు తంటాలు పడ్డారు. ఎట్టకేలకు మంగళవారం కేసు నమోదు చేశారు. ఈ విషయంపై సీఐ సాయినాథ్‌ను వివరణ కోరితే... దాడి చేసింది ఎవరనే విషయం బాధితులు చెప్పలేదని, విచారిస్తున్నామని అన్నారు. ఎస్ఐ ప్రసాద్‌ను వివరణ కోరగా... తనకు ఏమీ తెలియదని చెప్పుకొచ్చారు. దాడి చేసిన వారెవరో పోలీసులకు తెలిసినా గుర్తు తెలియని వ్యక్తులుగా కేసు నమోదు చేయడం గమనార్హం. అధికారపార్టీ నేతల ఒత్తిళ్లకు పోలీసులు తలొగ్గారనే విషయం అర్థమవుతోంది.

వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌పై అవగాహన


శింగనమలలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరమ్మ

శింగనమల జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంతో పాటు సోదనపల్లి గ్రామంలో మంగళవారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జిల్లా వ్యసాయధికారి ఉమామహేశ్వరమ్మ, కేవీకే రెడ్డిపల్లి ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ మల్లిశ్వరి హాజరయ్యారు. ఉమా మహేశ్వరమ్మ మట్లాడుతూ.. రైతులకు సబ్సిడీపై విత్తన వేరుశనగ పంపిణీ, ఎరువుల సరాఫరా, భూసార పరీక్షలు, ఖరీఫ్ పంటలు సాగు వివరాలపై అవగాహన కల్పించారు. పంటల సాగులో నూతన పద్ధతులు,మెలకులు పాటిస్తే దిగుబడులు సాధించవచ్చని సూచించారు. రెడ్డిపల్లి శాస్త్రవేతలు భార్గవి, రాజన్న పశువైద్యుడు కిరణ్ కుమార్, ఏఓ అన్వేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

గార్లదిన్నె, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ.. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. చిన్న చిన్న సమస్యలుంటే గ్రామాల్లోనే పరిష్కారం చేయాలని సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ మహమ్మద్‌గౌస్ బాషాకు సూచించారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలకు కేరాఫ్‌గా మారిన తలగాసిపల్లి క్రాస్, కల్లూరు జంక్షన్ వద్ద తగు చర్యలు చేపట్టాలని తెలిపారు.

విత్తన వేరుశనగ కాయల పరిశీలన

రామగిరి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో రైతు సేవా కేంద్రానికి చేరిన విత్తన వేరుశన కాయల్ని టీడీపీ నాయకులు, వ్యవసాయ అధికారులు మంగళవారం పరిశీలించారు. విత్తన నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. రైతులు విత్తన వేరుశనగ కోసం రైతుసేవా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతుసంఘం మండల అధ్యక్షుడు పూజారి చిన్నఅక్కులప్ప, టీఎన్‌టీయూసీ నాయకులు నాగేశ్‌నాయుడు, విశ్వనాథ్, అంజనేయులు, నరసయ్య పాల్గొన్నారు.

నేడు విజయోత్సవాలు: ఎమ్మెల్యే దగ్గుబాటి

అనంతపురం అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచక పాలనకు ఓటుతో బుద్ధి చెప్పి టీడీపీని గెలిపించి ఏడాది అవడంతో బుధవారం విజయోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఉదయం 10:30 గంటలకు విజయోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు ఓటుతో ప్రజాతీర్పును ఇచ్చిన రోజును వైసీపీ వెన్నుపోటు దినంగా ప్రకటించి నిరసనలు చేపట్టాలని నిర్ణయించడం దుర్మార్గమన్నారు. వైసీపీ నేత ల తీరు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఉందన్నారు. వైసీపీ డైవర్ట్ రాజకీయాలను ప్రజలంతా గమనిస్తున్నారని, ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ఆపార్టీ కనుమరుగుకావడం ఖాయమని పేర్కొన్నారు.

సీనియారిటీ, వేకెన్సీ సమస్యలు పరిష్కరించాలి

● డీఈఓకు ఏపీటీఎఫ్ నేతల వినతి

అనంతపురం విద్య, జూన్ 3(ఆంధ్రజ్యోతి): స్కూల్ అసిస్టెంట్ టీచర్ల సీనియారిటీ, వేకెన్సీ సమస్యలు పరిష్కరించాలని, ఆ తర్వాతనే వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఏపీటీఎఫ్ నాయకులు డీఈఓను ప్రసాద్‌బాబును కోరారు. నగరంలోని మంగళవారం వారు డీఈఓ ను కలిసి మాట్లాడారు. స్కూల్ అసిస్టెంట్స్ సీనియారిటీ, ఖాళీల జాబితాలు విడుదల చేసి అభ్యంతరాల కోసం ఒక రోజు కూడా గడువు ఇవ్వలేదన్నారు. దీంతో మెజార్టీ టీచర్లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. గ్రీవెన్సులకు గడువు ఇవ్వకుండా ఆగమేఘాల మీద వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని టీచర్లపై ఒత్తిడి తేవడం సరికాదన్నారు. సమస్యలు పరిష్కరించిన తర్వాతే వెబ్ కౌన్సెలింగ్‌కు చేయాలన్నారు. అనంతరం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సర్దార్‌వలి, జిల్లా ఆడిట్ కన్వీనర్ వన్నప్ప, ఇతర నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కుల చట్టం పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు

అనంతపురం రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల హక్కుల చట్టం (తెలుగు అనువాదం) 2016 పుస్తకాన్ని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం దివ్యాంగుల సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంఘం నాయకులు పలు సమస్యలను డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. చాలా చోట్ల దివ్యాంగుల పట్ల దౌర్జన్యాలు, దూషణలు ఎక్కువగా జరుగుతున్నాయని వాపోయారు. బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి, ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, కోఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి, న్యాయ సలహాదారుడు జెన్నె ఆనంద్, గౌరవసలహాదారుడు ముత్యాలప్ప, జిల్లా అధ్యక్షుడు వసంతకుమార్, కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.

వారికి ఇంటి వద్దకే రేషన్: ఆర్డీఓ

శింగనమల, జూన్ 3(ఆంధ్రజ్యోతి): 65 ఏళ్ల వయసు దాటిన వారికి, నడవలేని దివ్యాంగులకు, అనారోగ్యంతో మంచానికి పరిమితమైన వారికి ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేస్తామని అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు పేర్కొన్నారు. మండలకేంద్రంతో పాటు సలకం చెరువు గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించి పలువురు వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకే రేషన్ పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 65 ఏళ్ల వయసు దాటిన వారు, నడవలేని దివ్యాంగులు, మంచానికి పరిమితమైన వారి జాబితాను ప్రతి రేషన్ షాపు డీలరు తయారు చేసుకుని, ప్రతినెలా వారి ఇళ్ల వద్దకే వెళ్లి సరుకులు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాకే బ్రహ్మయ్య, సీఎస్‌జీటీ, చంద్రకళ, డీలర్లు సత్తి, నాగేంద్ర, వీఆర్ఓ ఎర్రితాతయ్య తదితరులు పాల్గొన్నారు.

●అనంతపురంరూరల్: రేషన్ సరుకుల కోసం 65ఏళ్ల పైబడిన వారు, దివ్యాంగులు, మంచానికి పరిమితమైన కార్డుదారులు రేషన్‌షాపులకు రావాల్సిన అవసరం లేదని, వారికి ఇంటి వద్దకే డీలర్లు వచ్చి సరుకులు అందజేస్తారని అర్బన్, రూరల్ మండలాల తసీల్దార్లు హరికుమార్, మోహన్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ప్రతినెలా1 నుంచి 5వతేదీ లోపు వారి ఇళ్ల వద్దకే డీలర్లు వచ్చి సరుకులు అందజేస్తారన్నారు. రేషన్ విషయంలో ఎలాంటి సమస్యలున్నా తహసీల్దార్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నంబరు 7842313116కు లేదా కలెక్టరు కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నంబర్ 8500292992కు కాల్ చేయవచ్చునని వారు పేర్కొన్నారు.

డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో క్రీడాపోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నషా ముక్త్ భారత్ అభియాన్ అవగాహనలో భాగంగా మంగళవారం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో క్రీడా పోటీలు నిర్వహించారు. మత్తు పదార్థా ల వినియోగం వలన కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు సున్నితమైన అవగాహన కల్పించడమే క్రీడా పోటీల ముఖ్య ఉద్దేశ్యమని మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. ఈగల్ కమిటీ సభ్యులు హనుమంతు మాట్లాడుతూ మత్తు పదార్థాలు వాడితే తీసుకునే చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం కబడ్డీ, బాస్కెట్‌బాల్, షటిల్ క్రీడా పోటీలు నిర్వహించి విజేతలతకు బహుమతులు ప్రదానం చేశారు. శాప్ సీనియర్ కోచ్ అనిల్‌కుమార్, విభిన్నప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ వినోద్‌కుమార్, సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేయాలి: సీపీఐ

రాప్తాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ ప్రభుత్వం అమలు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున డిమాండ్ చేశారు. మండల కేంద్రం సమీపంలోని సీపీఐ కాలనీలో బుధవారం సీపీఐ శాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని కూటమి అధికారంలోకి వచ్చిందని, అయితే పింఛన్ మాత్రమే పెంచారని, మిగతా పథకాలు అమలు చేయలేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నాగరాజు, రాప్తాడు మండల కార్యదర్శి రవీంద్ర, పలువురు నాయకులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు టీడీపీ విజయోత్సవ ర్యాలీ

తాడిపత్రి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ దుష్టపాలనపై తెలుగుదేశం పార్టీ అఖండ విజయం సాధించి సంవత్సరం పూర్తయిన సందర్భంగా బుధవారం పట్టణంలో విజయోత్సవ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఉదయం 10:30 గంటలకు ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద నుంచి ఇంటి వరకు నిర్వహించే ఈ ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంస్థలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు అభివృద్ధి పనులకు శ్రీకారం

కళ్యాణదుర్గం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు బుధవారం పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. పట్టణంలోని కరణం చిక్కప్ప పాఠశాలలో భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తారు. అదేవిధంగా మార్కెట్ యార్డులో మహిళలకు కుట్టుశిక్షణను ప్రారంభిస్తారు. కంబదూరు మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన ప్రభుత్వాస్పత్రిని ప్రారంభిస్తారు. కదిరి దేవరపల్లి నుంచి తిరుపతికి వెళ్లే రైలును ఎమ్మెల్యే పునః ప్రారంభిస్తారు.

ఇసుకదిన్నెల పరిశీలన

యల్లనూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలాపురం గ్రామ సమీపంలో ఇసుకదిన్నెలను మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ శేషారెడ్డి మంగళవారం పరిశీలించారు. సర్వేనెంబరు 2లో ఇసుక తవ్వకాల కోసం దరఖాస్తు చేసుకోవడంతో మండల సర్వేయర్ శర్వాణితో కలిసి ఆయన పరిశీలించారు.

చౌక ధరల దుకాణాల తనిఖీ

డీ.హీరేహాళ్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పలుపలు చౌక ధరల దుకాణాలను తహశీల్దార్ మునివేలు మంగళవారం తనిఖీ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి.. సరుకులు పంపిణీ చేయాలని డీలర్లకు సూచించారు. వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దకే వెళ్లి.. సరుకులు అందజేయాలన్నారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఫిర్యాదుపై విచారణ

కణేకల్లు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలో గతంలో విద్యుత్ కాంట్రాక్టర్‌గా పనిచేసిన దేవరాజ్‌ను విద్యుత్‌శాఖ అధికారులు మంగళవారం విచారణ చేశారు. తన కాంట్రాక్టర్‌కు మంజూరైన దాదాపు 19 పనులకు సంబంధించిన సొమ్మును దేవరాజ్ అకౌంట్‌లోకి జమ చేసుకున్నట్లు కణేకల్లుకు చెందిన సుధాకర్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. తాము పెట్టుబడులు పెట్టి పనిచేస్తే వేరే కొరికి బిల్లులు చేశారని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారులు దీనిపై విచారణకు ఆదేశించారు. కళ్యాణదుర్గం డీఈ రాజశేఖర్, ఉరవకొండ ఏడీఏ భాస్కర్ మంగళవారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో బాధితులతో విచారణ చేపట్టారు.

కౌలు రైతులకు న్యాయం చేయాలి


తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

విడపనకల్లు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌలు రైతులను ఆదుకోవాలని కౌలు రైతు సంఘం నాయకులు రంగారెడ్డి, వెంక టేశులు కోరారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద మంగళ వారం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. కౌలు రైతులు ముందు గానే కౌలు చెల్లించి పంటలు సాగు చేస్తున్నారని, పంటలు పండక పోతే కనీసం చేసిన కూలి కూడా రాకుండా నష్టపోతున్నారన్నారు. కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసు కోవాలన్నారు. రైతుభరోసా, సబ్సిడీ విత్తనాలు, బ్యాంక్‌లో రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దారు చంద్రశేఖరయ్యకు ఇచ్చారు.

సంపద తయారీ కేంద్రాల పరిశీలన

బొమ్మనహాళ్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీధరఘట్ట, ఉంతకల్లు, దర్గాహొన్నూరు గ్రామాల్లోని సంపద తయారీ కేంద్రాలను అనంతపురం డీపీఓ నాగరాజు నాయుడు, డిప్యూటీ ఎంపీడీఓ దాస్ మంగళవారం పరిశీలించారు. సంపదను సృష్టించి గ్రామాలను అభివృద్ధి చేయాలని సర్పంచులు, కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ముక్కన్న, శకుంతలమ్మ, పంచాయతీ కార్యదర్శులు శివన్న, పల్లవి, వెంకటేశ్, టీడీపీ నాయకులు ముక్కన పాల్గొన్నారు.

వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్


విడపనకల్లులో...

విడపనకల్లు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామా ల్లో రేషన్ డీలర్లు మంగళవారం వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ సరుకులు అందజేశారు. ఇందులో టీడీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

● పుట్లూరు: మండలంలోని కుమ్మనమలలో వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకే రేషన్ సరుకులను మంగళవారం అందజేశారు. ఇందులో స్పెషల్ ఆఫీసర్ ఆంజనేయులు, తహసీల్దార్ శేషారెడ్డి, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు, ఐటీడీపీ ఛాంపియన్ పెద్దిరాజు పాల్గొన్నారు.

● పెద్దవడుగూరు: వృద్ధులు, వికలాంగులకు ఇంటివద్దకే రేషన్ సరఫరా చేస్తామని, ఎలాంటి సమస్యలున్నా 85002 92992కు ఫోన్ చేయాలని తహసీల్దార్ ఉషారాణి సూచించారు.

● తాడిపత్రి : వృద్ధులకు, దివ్యాంగులకు రేషన్ బియ్యాన్ని ఇంటి వద్దకే పంపిణీ చేస్తారని తహసీల్దార్ రజాక్‌వలి ఆటో పెట్టి పట్టణ, పరిసర ప్రాంతాల్లో ప్రచారం చేయించారు. డీలర్లు సరుకులు ఇవ్వకపోతే తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు.

● గుంతకల్లుటౌన్ : మండలంలో 3,222 మంది వృద్ధులు, దివ్యాంగులు, మంచానికి పరిమితమైన వారు ఉన్నారని, వారి ఇళ్ల వద్దకే రేషన్ సరుకులు అందజేస్తామని తహసీల్దార్ రమాదేవి తెలిపారు.

● కూడేరు : ప్రభుత్వ ఆదేశాల మేరకు వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దనే డీలర్లు మంగళవారం బియ్యం అందించారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన డీలర్లు వారి ఇళ్ల వద్దకు వెళ్లి వేలి ముద్రలు సేకరించి సరుకులు అందజేశారు.

● రాయదుర్గంరూరల్ : పట్టణం, రూరల్‌లో మొత్తం 1,680 మంది దివ్యాంగులు ఉన్నారని, వారికి ఇళ్ల వద్దే రేషన్ సరుకులు అందజేస్తామని తహసీల్దార్ నాగరాజు తెలిపారు.

నూతన పద్ధతులతో అధిక దిగుబడులు

రాయదుర్గంరూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రైతులు నూతన పద్ధతుల్లో సాగు చేస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త చంద్రనాయుడు సూచించారు. మంగళవారం మండలంలోని జుంజురంపల్లి, ఆవులదట్ల, వేపరాల, కొండాపురం, వడ్రవన్నూరు గ్రామాల్లో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

యథేచ్ఛగా చెట్ల నరికివేత

● తరిగిపోతున్న పచ్చదనం ● పట్టించుకోని అధికారులు

బొమ్మనహాళ్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమార్కులు యథేచ్ఛగా చెట్లను నరికి తమ జేబులు నింపుకుంటున్నారు. దీంతో మండ లంలో నానాటికీ పచ్చదనం తరిగిపోతోంది. ఈ అక్రమార్కులతో కొందరు రెవెన్యూ, ఆటవీ శాఖ అధికారులు కుమ్మక్కు అయ్యారనే ఆరోపణలూ ఉన్నాయి. చెట్లు కొట్టేయకుండా ఉండేందుకు ప్రభుత్వం తెచ్చిన వాల్టా చట్టానికి తూట్లు పడుతున్నాయి. ఈ అధికారుల అండతో అక్రమార్కులు గ్రామాల్లోని చెట్లతో పాటు రైతులు పెంచుకున్న చెట్లు సైతం అక్రమార్కుల నరికి సొమ్ము చేసుకుంటున్నారు. చెట్లను రక్షించాల్సిన అధికారులే.. అవినీతిపరులను మరింత ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. చెట్లును నరికి అక్రమంగా బళ్లారి, గుంతకల్లు తదితర ప్రాంతలకు తరలిస్తున్నారు.

● అమలు కాని వాల్టా

వాల్టా చట్టం-2002 ప్రకారం ఎవరైనా చెట్లు కొట్టాలంటే తప్పనిసరిగా తహసీల్దారు అనుమతి తీసుకోవాలి. పొలంలో, రహదారులు, కొండల్లో చెట్లు నరికివేయాలంటే సర్వే నెంబరుతో సహా తహసీల్దారుకు దరఖాస్తు చేసుకుని వారితో అనుమతి తీసుకోవాలి. అనంతరం రెవె న్యూ అధికారులు పరిశీలించి ఆటవీ అధికారులకు నివేదిక పంపించాలి. అధికారుల అనుమతి కోసం చలానా చెల్లించాలి. రెండు శాఖల అధికారుల నుంచి అనుమతి వచ్చిన తర్వాతే చెట్లను నరికి తరలించాలి. అయితే క్షేత్ర స్థాయిలో ఒక్కరు కూడా దరఖాస్తులు చేస్తున్నా దాఖాలాల్లేవు. నిత్యం ట్రాక్టర్లు, ఐచర్ వాహనాలల్లో నరికేసిన చెట్లు తరలిపోతూ కనిపిస్తున్నాయి.


బొమ్మనహాళ్ మండలంలో నరికిన చింత చెట్లు

చర్యలు తీసుకుంటాం

అనుమతిలేకుండా మండలంలో చెట్లును నరికితే వారిపై చట్టపరమైనా చర్యలు తీసుకుం టాం. ఇబ్బందికరంగా ఉన్న చోట చెట్లును తొలగించేందకు ముందుగా అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలి. పరిశీలించి చెట్టు తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. ఎవరైన చెట్టు నరుకుతున్నట్లు తెలిస్తే అటవీశాఖ, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వండి.

\- మునివేలు, తహసీల్దార్, బొమ్మనహాళ్

వెన్నుపోటుకు మారుపేరు జగన్


మాట్లాడుతున్న బండారు ఆనంద్

గుంతకల్లు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మోసానికి మారు పేరు .. వెన్నుపోటుకు చిరునామా అయిన మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రస్తుత ప్రభుత్వంపై వెన్నుపోటు దినం పేరుతో నిరసన చేపడుతుండటం విడ్డూరంగా ఉందని టీడీపీ పట్టణాధ్యక్షుడు బండారు ఆనంద్ ఎద్దేవా చేశారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ.. అన్న క్యాంటీన్లను మూసేసి జగన్ పేదలకు వెన్నుపోటు పొడిచారన్నారు. సొంత చిన్నాన్న వివేకానందరెడ్డికి వెన్నుపోటు పొడవడమే కాకుండా, తన పరిపాలనలో మూడు రాజధానులంటూ ప్రజలకు కూడా ద్రోహం చేశాడని అన్నారు. జగన్ ను నేడు ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు గుజిరీ మహమ్మద్ ఖాజా, పాల మల్లికార్జున, అంజి, శివన్న, బీ శివశంకర్ పాల్గొన్నారు.

జగన్‌ను ప్రజలు ఇక నమ్మరు


గుత్తిలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గుత్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): తన ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల వారినీ మోసం చేసిన మాజీ సీఎం జగన్ ప్రాయశ్చితం చేసుకోవాల్సింది పోయి.. వెన్నుపోటు దినం పేరుతో గొప్ప నాటకానికి తెరలేపారని టీడీపీ నాయకులు విమర్శించారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ పట్టణ కన్వీనర్ ఎంకే చౌదరి, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి దిల్కా శీనా, న్యాయవాది సోమశేఖర్ మాట్లాడారు. సొంత చెల్లి, తల్లిని, చిన్నాన్నను మోసం చేసిన జగన్‌ను ప్రజలు నమ్మేపరిస్థితి లేరన్నారు. ఈ సమావేశంలో టీడీపీ సర్పంచు లింగమయ్య, నాయకులు కొనకొండ్ల సూరి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చికెన్ శ్రీనివాసులు, ప్రతాప్, మద్దిలేటి, నిజాం, రసూల్, ఎండీ రియాజ్, రవి పాల్గొన్నారు.

ఉనికి కోసం జగన్ పాట్లు


బెళుగుప్పలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

బెళుగుప్ప, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఉనికిని కాపాడుకోవడం కోసమే మాజీ సీఎం జగన్‌రెడ్డి వెన్నుపోటు దినం చేపడుతున్నారని టీడీపీ నాయకులు విమర్శించారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నాయకులు తగ్గుపర్తి, రాధాకృష్ణ, మల్లికార్జున, తిమ్మప్ప జిల్లా అభివృద్ధి కమిటీ సభ్యులు రామ్మోహన్, తిప్పేస్వామి, అనిల్, దామోదర, మారెప్ప, శ్రీరంగాపురం, తిప్పేస్వామి, తిమ్మప్ప, వెంకటస్వామి, ఈరన్న మాట్లాడారు. నీచ, అవినీతి రాజకీయాలకు పాల్పడిన జగన్‌కు జైలు పోటు తప్పదని విమర్శించారు. పలు కేసుల్లో నిందితులుగా ఉన్న వైసీపీ నాయకులకు టీడీపీని విమర్శించే అర్హత లేదన్నారు. టీడీపీ ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.

ఎస్సీ, ఎస్టీ సమస్యలు పరిష్కరించండి

గుంతకల్లు టౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ సమస్యలను త్వరతగతిన పరిష్కరించాలని సంబంధింత అధికారులకు ఆర్డీఓ శ్రీనివాస్ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం డివిజనల్ స్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. నెలగొండ గ్రామంలో ఎస్సీ రైతుకు చెందిన పొలాల్లోకి దారి ఇవ్వకుండా అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, దోనిముక్కల రోడ్డులో ప్రభుత్వం ఇచ్చిన స్థలాల విషయంలో ప్రజలకు ఇప్పటికి నకిలీ, ఒరిజినల్ పట్టా తెలియకుండా ఇబ్బందులు పడుతున్నారన్నారు. యాడికి, పెద్దవడూగురు గ్రామాల్లో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని అన్నారు. ఇందులో కమిటీ సభ్యులు హరిప్రసాద్‌యాదవ్, సాకే గోవిందు, కావలి గోవిందు, గుంతకల్లు డివిజన్ తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సీఐలు, ఎంఈఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'దళితులపై వివక్ష చూపితే ఉద్యమిస్తాం'


ఆందోళన చేస్తున్న దళిత సంఘాల నాయకులు

కళ్యాణదుర్గం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): దళితుల పట్ల వివక్ష చూపిస్తే పెద్దఎత్తున ఉద్యమిస్తామని దళిత ప్రజాసంఘాల నాయకులు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ప్రజావేదిక వద్ద దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. మండలంలోని బోరంపల్లిలో దళితులకు రేషన్‌షాపును కేటాయిస్తే కొంతమంది వ్యతిరేకంగా మాట్లాడుతున్నారన్నారు. ఇలాగే చేస్తే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పెద్దారెడ్డి పర్యటనను అడ్డుకుంటాం

యాడికి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వెన్నుపోటు దినం నిర్వహించడానికి యాడికికి బుధవారం వస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని అడ్డుకుంటామని మండల టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో టీడీపీ నాయకులపై లెక్కలేనన్ని అక్రమ కేసులు బనాయించారని, అలాంటి పెద్దారెడ్డిని మండలంలో ఎక్కడ పర్యటించినా అడ్డుకుంటామని తెలిపారు. మండలం ప్రశాంతంగా ఉందని, మళ్లీ ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించడానికే పెద్దారెడ్డి వస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో తెలుగు యువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పరిమి చరణ్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు గండికోట లక్ష్మణ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆదినారాయణ, నాయకులు బొట్టు శేఖర్, మధురాజు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం


కూడేరులో బోరు వేయిస్తున్న నాయకులు

కూడేరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తాగునీటి సమస్యపై మహిళలు సోమవారం ఆందోళన చేపట్టిన విషయం తెల్సిందే. దీనిపై మంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ నేత పయ్యావుల శ్రీని వాసులు వెంటనే స్పందించారు. సమస్య ఉన్న ప్రాంతంలో తక్షణం బోరు వేయాలని సంబందిత అధికారులను ఆదేశించారు. అధికారులు సోమవారం రాత్రే ఆ ప్రాంతంలో బోరు వేయించగా.. పుష్కలంగా నీరు పడ్డాయి. తాగునీటి సమస్య పరిష్కారమైనందుకు ఆ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేశారు.

అర్హులకు ఇంటిస్థలాలు ఇవ్వాలి: సీపీఐ


ధర్నాలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

గుత్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వడంతో పాటు ఇళ్లను నిర్మించి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు నాయకులు, పేదలు ర్యాలీ నిర్వహించి.. అక్కడ ధర్నా చేపట్టారు. అనంతరం కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనాయక్‌కు వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, మండల కార్యదర్శి రామదాసు, పట్టణ కార్యదర్శి రాజు, నాయకులు పాల్గొన్నారు.

జన సైనికులకు సభ్యత్వ కిట్ల అందజేత


మాట్లాడుతున్న జనసేన నేత కదిరి శ్రీకాంత్‌రెడ్డి

పెద్దవడుగూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ కార్యకర్తలకు క్రియాశీలక సభ్యత్వ కిట్లను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కదిరి శ్రీకాంత్‌రెడ్డి అందజేశారు. ఇందులో మండల అధ్యక్షుడు దూద్‌వలి, కిరణ్‌కుమార్, దాదావలి, రమేష్ పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

బొమ్మనహాళ్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొల్లనగుడ్డం సచివాలయాన్ని తహసీల్దార్ మునివేలు మంగళవారం తనిఖీ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి.. వారి సమస్యలను పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట వీఆర్‌ఓ నరసింహమూర్తి ఉన్నారు.

క్రైం న్యూస్..

గొడవపై కేసుల నమోదు

యాడికి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయరెడ్డిపల్లిలో సోమవారం జరిగిన గొడవకు సంబంధించి ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటరమణయ్య తెలిపారు. టీడీపీకి చెందిన రాంమోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఓబులేసు, ప్రసాద్, రమేష్, లక్ష్మీనారాయణ మరికొంతమందిపై కేసు నమోదు చేశామన్నారు. వైసీపీకి చెందిన మారుతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హరికృష్ణ, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, కిషోర్ మరికొంతమందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా, బోయరెడ్డిపల్లిలో సోమవారం జరిగిన గొడవల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా స్పెషల్‌పార్టీ పోలీసులతో పాటు స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

తాడిపత్రి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి సమీపంలోని అక్కన్నపల్లి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన దాదాపు 200 ప్యాకెట్ల (ఒక్కొక్కటి 50 కేజీలు) రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు తహసీల్దార్ రజాక్‌వలి, రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. టెంపో యజమానులు వేణుగోపాల్, గంగాధర్ చుట్టుపక్కల గ్రామాల నుంచి సేకరించిన బియ్యాన్ని అక్కన్నపల్లిలో అన్‌లోడ్ చేస్తుండగా అరెస్ట్ చేశామన్నారు. వాహనాన్ని స్టేషన్‌కు, బియ్యాన్ని సివిల్ సప్లై గోడౌన్‌కు తరలించామన్నారు. ఈ దాడిలో సివిల్‌సప్లై అధికారి మారుతీప్రసాద్‌రెడ్డి, వీఆర్వో, సిబ్బంది పాల్గొన్నారని, నిందితులపై కేసు నమోదు చేశామని తెలిపారు.

● గుత్తి రూరల్ : మండలంలోని కరిడికొండ గ్రామ శివార్లలో ఓ గుడి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 60 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ ఓబిలేసు, ఎస్ఐ సురేష్ తెలిపారు. కేసు నమోదు చేశామని, నిందితుల కోసం గాలిస్తున్నామని ఎస్ఐ తెలిపారు. బియ్యాన్ని తహసీల్దార్ స్వాధీనం చేసుకున్నారు.

జూదరుల అరెస్ట్

తాడిపత్రి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగనూరు గ్రామసమీపంలో మంగళవారం నలుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.4,690ను స్వాధీనం చేసుకున్నామని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. ఆ నలుగురిపై కేసు నమోదుచేశామన్నారు.

సురక్షితంగా విద్యార్థి అప్పగింత

డీ.హీరేహాళ్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): తండ్రి మందలించాడని రెండు రోజుల కిత్రం ఇంటి నుంచి వెళ్లిపోయిన పదో తరగతి విద్యార్థిని పోలీసులు సురక్షితంగా అతని తల్లిదండ్రులకు మంగళవారం అప్పగించారు. మురడి గ్రామానికి చెందిన అభిషేక్ పదో తరగతి విద్యార్థి. చదువుకోమని తండ్రి శరభయ్య మందలించడంతో రెండు రోజుల కిత్రం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. అభిషేక్ కర్ణాటక రాష్ట్రం సండూరు ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించిన ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తన సిబ్బందితో అక్కడికి వెళ్లాడు. అభిషేక్‌ను మంగళవారం స్టేషన్‌కు తీసుకొచ్చి.. తల్లిదండ్రులకు అప్పగించారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీ

గుత్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు ప్రభుత్వ చౌక ధరల దుకాణాలను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. మెయిన్ బజార్‌లోని 8వ స్టోర్‌లో నిల్వకంటే అధికంగా 46 చక్కెర ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. ఆ డీలర్‌పై కేసు నమోదు చేసి... వాటిని రెవెన్యూశాఖకు అప్పగించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎస్ఐలు వెంకటప్రసాద్, వాసు, వీఆర్వో ఆదినారాయణమ్మ పాల్గొన్నారు.

చిరుత సంచారం


కొండపై ఉన్న చిరుత

వజ్రకరూరు (ఉరవకొండ), జూన్ 3(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని ప్యాపిలి, వెంకటాంపల్లి రహదారిలోని తూరాత్ కొండపై చిరుత సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గొర్రెలు కనిపించకపోవడంతో వాటిని వెతికేందుకు గొర్రెల కాపరులు వెళ్లారు. కొండపై చిరుత ఉండటాన్ని గమనించి పరుగులు తీశారు. రెండు గొర్రెలను ఎత్తుకెళ్లి చంపినట్లు గ్రామస్థులు తెలిపారు. రెండు నెలల క్రితం ఇక్కడే చిరుత కనిపించిందని, దానిని బంధించాలని అటవీశాఖ అధికారులను కోరామన్నారు.


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కాలవ భరత్

కాలవ క్రికెట్ టోర్నీ విజేత ఆర్డీటీ జట్టు

కణేకల్లు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కణేకల్లు క్రాసింగ్‌లో 15 రోజులుగా నిర్వహిస్తున్న కాలవ క్రికెట్ టోర్నీలో ఆర్డీటీ జట్టు విజయం సాధించింది. దాదాపు 42 జట్లు ఈ టోర్నీలో పాల్గొన్నాయి. కణేకల్లుకు చెందిన కేసీసీ, ఆర్డీటీ జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నిర్ణీత 14 ఓవర్లకు బ్యాటింగ్ చేసిన కేసీసీ జట్టు 90 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ఆర్డీటీ జట్టు 12 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి విజయం సాధించింది. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ విజేత టీం కెప్టెన్ అనీల్‌కు రూ. 30 వేలు, రన్నర్ టీంకు రూ. 15 వేలు, ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, బీటీ రమేష్, మారుతి, షేక్‌ముజ్జు, కురుబ నాగరాజు, విజయ్, సందీప్, పురుషోత్తం, నాగభూషణం, నితీష్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

బొమ్మనహాళ్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజనల్ వ్యాధుల పట్ల వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని బొమ్మనహాళ్ డీడీఓ డాక్టర్ శ్రవణ్‌కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక వైద్యశాలలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభం అవుతుండడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ ఈశ్వరయ్య, సూపర్‌వైజర్ యుగంధర్ పాల్గొన్నారు.

విజేత కొనకొండ్ల జట్టు

వజ్రకరూరు (ఉరవకొండ), జూన్ 3(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని కొనకొండ్ల జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో గతనెల 12 నుంచి నిర్వహిస్తున్న భీమిరెడ్డి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ మంగళవారం జరిగింది. కొనకొండ్ల టీం, చాబాల టీం ఫైనల్లో తలపడ్డాయి. ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో కొనకొండ్ల టీం విజేతగా నిలిచింది. విజేత జట్టుకు ట్రోఫీతో పాటు రూ.40వేలను మాజీ ఎంపీపీ రామచంద్ర అందజేశారు. రన్నర్ జట్టుకు రూ.20వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మునయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మాజీ ఎంపీపీ